సోమవారం
7-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 286
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

రాయిటర్స్ 'ఎక్స్' ఖాతా స్తంభన

న్యూఢిల్లీ: ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ సోషల్ మీడియా 'ఎక్స్' ఖాతా భారత్‌లో స్తంభించింది. అయితే ఈ చర్యతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేంద్ర సమాచార శాఖ ప్రకటించింది. "రాయిటర్స్‌ను బ్లాక్ చేయాల్సిన ఎలాంటి అవసరం భారత్ ప్రభుత్వానికి లేదు. మేము 'ఎక్స్'తో కలిసి ఈ సమస్యను పరిష్కరించే పనిలో ఉన్నాం" అని ప్రభుత్వ ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు. అయితే, రాయిటర్స్ ఎక్స్ ఖాతాను తెరవగానే "న్యాయపరమైన చర్యలతో భారత్‌లో ఈ అకౌంట్‌ను విత్‌హెల్డ్‌లో ఉంచడం జరిగింది" అనే మెసేజ్ వస్తోంది. కానీ, ఆ లీగల్ డిమాండ్ కేంద్ర ప్రభుత్వం నుంచి

- మిగతా 2 లో

చంద్రచూడ్ బంగ్లా ఖాళీ చేయించండి

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌ను వెంటనే దిల్లీలోని అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు పాలనా విభాగం కోరింది. 2024 నవంబరు 10న సీజేఐగా పదవీ విరమణ పొందిన జస్టిస్ చంద్రచూడ్, గత 8 నెలలుగా టైప్-8 అధికారిక బంగ్లాలోనే ఉంటున్నారని తెలుపుతూ జులై 1న కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శికి సుప్రీంకోర్టు పాలనా విభాగం లేఖ రాసింది. రిటైర్ అయ్యాక

- మిగతా 2 లో

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ నమోదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు గాను ఏపీఈఏపీసెట్-2025 వెబ్ కౌన్సెలింగ్‌కు నమోదు, ఫీజు చెల్లింపును సోమవారం నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఇందుకోసం తాజాగా ఏపీ ఈఏపీసెట్-2025 వెబ్‌సైట్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూలు పూర్తి వివరాలను https://eapcet-sche.aptonline.in/ ఈఏపీసెట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దాని

- మిగతా 2 లో

ప్రజావసరాలే అజెండా

- పేదల సొంతింటి కల సాకారం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- అభివృద్ధి చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల కుట్రలు
- బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం: భట్టి

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్/ఖమ్మం: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లాలో సొంత నియోజకవర్గం మధిరలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక కుట్రలు పన్నుతున్నాయన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రభుత్వాన్ని ఏమీ చేయలేరన్నారు. రాష్ట్రంలో కోటి పది లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు ఏదో ఒక సంక్షేమ పథకం అందుతూనే ఉందని వివరించారు. ప్రజల అవసరాలను ఓట్లుగా మార్చుకొని గత పది సంవత్సరాలు పరిపాలించి తమతమ అవసరాలు తీర్చుకున్నారు తప్ప ప్రజల ఇబ్బందులు తీర్చలేదని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు బిల్లులు కూడా మంజూరు చేయలేదని, పాలకులుగా విలాసవంతమైన జీవితాలు గడిపారు తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టి లక్షల కోట్లు అప్పులు తెచ్చారని, ఈరోజు వారు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పైసా పేదల కోసం ఖర్చు పెడుతున్నాం అన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా ఒక్కో ఇంటికి రూ.ఐదు లక్షలు ఖర్చు చేసి రాష్ట్ర వ్యాప్తంగా మొదటి దశలో నాలుగున్నర లక్షల ఇళ్లను ఈ ఏడాది నిర్మిస్తున్నామన్నారు. మొదటి ఏడాదిలో రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పాదయాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేక పేదలు పడుతున్న బాధలు గుర్తించి, నిజమైన పేదలందరికీ ఇల్లు నిర్మిస్తామని మాట ఇచ్చిన విషయాన్ని భట్టి గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు లేని పేదవారు ఏ ఒక్కరూ ఉండకూడ దని, ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో బతికేందుకు ఎన్ని వేల కోట్లు అయినా ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రజల అవసరాలే అజెండాగా రాష్ట్రంలో కోటి 12 లక్షల కుటుంబాలు ఉండగా 93 లక్షల కుటుంబాలకు రేషన్

- మిగతా 2 లో

మోదీ సర్కారుకు చుక్కలు



మోదీ ప్రభుత్వ గొప్పలకు ప్రతిపక్షాల సవాళ్లు అడ్డుకట్ట వేశాయి. పహల్గాం, ఆపరేషన్ సిందూర్, అవినీతి, మణిపూర్, రాజకీయ కక్షసాధింపుపై ప్రశ్నల వర్షంతో ప్రధాని మోదీ, బీజేపీ నేతలు జోరు తగ్గించుకోవాల్సి వచ్చింది. ప్రగల్భాల రాజకీయానికి ప్రతిపక్ష పార్టీల విమర్శలతో అవి చేశాం... ఇవి సాధించామని గొప్పలు చెప్పుకునే పరిస్థితి కరువైంది. అంతా తమ ఘనతే అన్న మోదీ ప్రభుత్వ వైఖరిని విపక్షాలు తీవ్రంగా దుయ్యబట్టాయి.

- పహల్గాం, ఆపరేషన్ సిందూర్‌పై విపక్షాల ప్రశ్నల వర్షం
- అవినీతి, మణిపూర్, రాజకీయ కక్షసాధింపుపై నిలదీత
- గొప్పలపై జోరు తగ్గించుకున్న మోదీ, బీజేపీ

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య 88 గంటల సైనిక చర్య అనంతర పరిణామాలతో దేశ రాజకీయ ముఖ చిత్రం మారింది. తప్పుడు వాదనలు, గొప్పల రాజకీయాలు కట్టిపెట్టి ప్రజా సమస్యలపై మాట్లాడాలంటూ మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఒత్తిడి తీసుకొచ్చాయి. ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రస్థాయిలో ఎండగట్టాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కాంగ్రెస్ తన పాత్రను మరవలేదు. ఆర్థిక కష్టాలు, వనరుల కొరత ఉన్నప్పటికీ బీజేపీని దీటుగా ఎదుర్కొంటోంది. దీంతో కొంతమేరకు పైచేయి సాధించింది. బీజేపీ తరపున మాట్లాడేందుకు 30 మంది అధికార ప్రతినిధులు ఉన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీలకు ఆ పరిస్థితి లేదు. ఓఎన్‌జీసీ బోర్డు నాన్-అఫిషియల్ డైరెక్టర్‌గా బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర నియామకంపై హక్కుల కార్యకర్త యోగేంద్ర యాదవ్ 'ఎక్స్' మాధ్యమంగా స్పందించారు. 'బీజేపీ తరపున మాట్లాడే అధికార ప్రతినిధికి వేతనం రూ.27లక్షలా...' అని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో రెండవ-మూడవ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీలుగా సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ), తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఉన్నాయి. జాతీయ పార్టీలుగా ఎదిగేందుకు యత్నిస్తున్నాయి. టీఎంసీ ఇప్పటికే 20 రాజేంద్ర ప్రసాద్ రోడ్డులో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించనున్నది. ఇప్పటికే మణిపూర్, మహిళలు, యువత, అవినీతి, రాజకీయ

- మిగతా 2 లో

మోదీ వైఫల్యాల సంగతేంటి?

- ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయి?
- బీజేపీ లేఖపై మంత్రి పొన్నం ఆగ్రహం

విశాలాంధ్ర-హైదరాబాద్: మోదీ ప్రభుత్వ వైఫల్యాల సంగతేమిటిని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడాన్ని తప్పుపట్టారు. 11 ఏళ్ల కిందట కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ ప్రజలను అడుగడుగునా వంచించిన పార్టీ మీది కాదా అని నిలదీశారు. గత మూడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రధాని విస్మరించి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని విమర్శించారు. 'వాగ్దానాలతో ఊదరగొట్టడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మీరు చేసిందేమీ లేదు. రైతులు, యువకులు, మహిళలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ.. ఇలా అన్ని వర్గాలను వంచించిన చరిత్ర మీది. మీ వైఫల్యాలు రాస్తే రామాయణమంత.. వింటే భారతమంత. అలాంటి మీరు మా ముఖ్యమంత్రికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉంది' అని పొన్నం ప్రభాకర్

- మిగతా 2 లో

చెంచులకు 13 వేల ఇందిరమ్మ ఇళ్లు

- గిరిజన నియోజకవర్గాలకు
- అదనంగా 9 వేలు: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: సమాజంలో అత్యంత వెనుకబడిన చెంచులు దశాబ్దాల పాటు సొంత ఇళ్లకు నోచుకో లేదని, వారి సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలోని 21 నియోజకవర్గాలలో ప్రాధాన్యతా క్రమంలో 13,266 చెంచు కుటుంబాలను ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారని, ముఖ్యమంత్రి కూడా అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో చెంచులకు గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారని, వారి సూచనలు, సలహాల మేరకు చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. తొలి విడతలో భాగంగా సోమవారం అచ్చంపేట నియోజకవర్గం మున్ననూర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తో కలిసి చెంచులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను తానే అందజేస్తా నని తెలిపారు. ఉట్నూరు ఐటీడీఏ పరిధిలో మంచిర్యాల 157, నిర్మల్ 153,

- మిగతా 2 లో

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- దళారులను ఆశించి మోసపోవద్దు: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: పారదర్శకంగానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, ఎవరూ దళారులను ఆశ్రయించవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల తొలివిడతలో భాగంగా లబ్ధిదారులకు హక్కుపత్రాలు, నిర్వాసితులకు పట్టాలు ఆదివారం స్థానిక క్లబ్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... కమిటీ సూచనల మేరకు లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. ఇళ్లు ఇప్పిస్తామని ఎవరైన డబ్బులు డిమాండ్ చేస్తే పోలీస్ కేసులు పెట్టాలని సూచించారు. పేదలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కొత్తగూడెం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధి మరింత వేగం పుంజుకోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మంత్రిని అభ్యర్థించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో చొరవచూపాలని కోరారు. బీపీఎల్ కోటా కింది సాధారణ ధరలకు వారికి స్థలాలు కేటాయిస్తే మేలని సూచించారు. సింగరేణి భూముల్లో చాలా కాలంగా పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, వాటిని క్రమబద్ధీకరించాలన్నారు. పాల్వంచలో జీవో 76 వలన ప్రతీ సారి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని మంత్రి పొంగులేటిని కోరారు. దీంతో స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ మేలు చేకూరుతుందన్నారు." నిరాశకు గురికావాల్సిన పనిలేదన్నారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, టీపీసీసీ సభ్యులు నాగసీతారాములు, కోనేరు చిన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, హనుమంతరావు, కొత్వాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెక్సాస్‌లో వరద బీభత్సం

51కి పెరిగిన మృతులు
సహాయక చర్యలు ముమ్మరం

2 లో



పేదరికం పెరిగిపోతోంది

- కొద్దిమంది వద్దే సంపద కేంద్రీకృతం
- కేంద్ర మంత్రి గడ్కరీ ఒప్పుకోలు

ముంబై: భారతదేశంలో పెరుగుతున్న సంపద అసమానతలపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. పేదల సంఖ్య పెరగడంతో పాటు కొంతమంది వద్దే సంపద కేంద్రీకృతం కావడం దేశ సామాజిక-ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన సవాలుగా మారుతుందని హెచ్చరించారు. నాగపూర్‌లో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ 'పేదల సంఖ్య పెరుగుతోంది. సంపద కొంతమంది సంపన్నుల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. అది జరగకూడదు' అని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చేరే వికేంద్రీకృత సంపద సృష్టి, సమ్మిళిత వృద్ధి అవసరాన్ని అనుభవజ్ఞుడైన నాయకుడు నొక్కి చెప్పారు. భారతదేశ అభివృద్ధిని జీడీపీ గణాంకాల ద్వారా మాత్రమే కాకుండా దాని అట్టడుగు, గ్రామీణ వర్గాల అభ్యున్నతి ద్వారా కూడా కొలవాలని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి జరిగే విధంగా ఆర్థిక వ్యవస్థ పెరగాలని... ప్రత్యామ్నాయ మార్గాలను తాము అన్వేషిస్తున్నామని తెలిపారు. సంపద

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మమ్మల్ని కూడా అందులో చేర్చే బావా! హాయిగా పడుంటాం!

పాకిస్థాన్ ముసుగులో భారత్‌తో చైనా వైరం

ఆర్వీ రామారావ్

టిప్పణి

ఇంతకు ముందే అందరికీ తెలిసిందే అయినా భారత సైన్యాధికారి లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఒక విశేషం బయట పెట్టారు. ఆపరేషన్ సిందూర్ పేర మనం పాకిస్థాన్‌తో యుద్ధం చేస్తున్నప్పటికీ నిజానికి రెండు దేశాలతో యుద్ధం చేయవలసి వచ్చిందని ఆయన అన్నారు. అంటే పరోక్షంగా చైనాతో కూడా పోరాడవలసి వచ్చిందని ఆయన మాటల అర్థం. భారత చైనా మధ్య శతాబ్దాల నుంచి మనకు సంబంధాలున్నాయని, ఆ సంబంధాలు నాగరికతకు సంబంధించినవని అనుకుంటూ ఉంటాం. కానీ చైనా ఎటు వేపు ఉందో లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింఘ్ మరో మారు బయట పెట్టారు. పాకిస్థాన్ సమకూర్చుకుంటున్న ఆయుధాలలో 81 శాతం చైనా నుంచే అందుతున్నాయి. చైనా పాకిస్థాన్ కు సంపూర్ణంగా మద్దతు పలికింది. ఈ ఘర్షణలో మనకు కనిపించే ముఖం పాకిస్థాన్‌దే అయినా దాని వెనక ఉన్నది చైనా. తాను పాకిస్థాన్ కు అందిస్తున్న ఆయుధాలు ఎలా పని చేస్తున్నాయో పరీక్షించుకోవడానికి చైనా ప్రయత్నించింది. ఆపరేషన్ సిందూర్ తరవాత మోదీ ప్రభుత్వం ఇప్పటిదాకా ఏ వివరాలూ బయట పెట్టలేదు. భారత జెట్ విమానం కూలిందన్న సమాచారం కూడా ప్రభుత్వం నిర్ధారించలేదు. కానీ వాయు సేన అధిపతి ఎర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తమకు యుద్ధ సామాగ్రి అందించడంలో మన ప్రభుత్వం ఎలా విఫలం అవుతోందో విప్పి చెప్పారు.

భారత సైనిక దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్ సింగపూర్ లో మాట్లాడుతూ మన జెట్ విమానాలు కూలాయని అంగీకరించారు. కానీ మన విమానాలు కూలడం ప్రధానాంశం కాదు. అవి ఎందుకు కూలాయన్నదే ముఖ్యం అని కూడా ఆయన చెప్పారు. అందులో రాఫేల్ యుద్ధ విమానాలు కూడా ఉన్నాయి. పాకిస్థాన్ తో ఘర్షణ జరిగిందే మూడు, మూడున్నర రోజులు. ఈ క్రమంలో మన తప్పేమిటో గుర్తించి ఆ పొరపాట్లను సరిదిద్దుకున్నాం అని కూడా జనరల్ చౌహాన్ అన్నారు. ఈ సమాచారం సైన్యం తరఫున అందిందే తప్ప కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ విషయమూ తెలియలేదు.

ఆ తరవాత ఇండోనేసియాలో భారత సైనిక ప్రతినిధి శివ కుమార్ కొన్ని అంశాలు బయట పెట్టారు. మన యుద్ధ విమానాలు కూలడానికి రాజకీయ నాయకత్వం నుంచి నిర్దేశాలు సరిగ్గా లేకపోవడమే దీనికి కారణం అని ఆయన నిర్మొహమాటంగానే చెప్పారు. పైగా ప్రభుత్వం నుంచి నియంత్రణ కూడా ఉందని ఆయన అన్నారు. కానీ ఆపరేషన్ సిందూర్ ప్రారంభించే ముందు సాయుధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని ప్రధానమంత్రి మోదీ చెప్పిన విషయం ఉత్తిదే అనుకోవాలి. పాకిస్థాన్ సైన్యం మీద సైనిక స్థావరాల మీద దాడి చేయకూడదని ప్రభుత్వం ఆదేశించింది. కేవలం తీవ్రవాద స్థావరాలని ధ్వంసం చేయడానికే పరిమితం కావాలని చెప్పింది. శివకుమార్ మాటలను సందర్భ రహితంగా మీడియా

- మిగతా 2 లో

టెక్సాస్‌లో వరద బీభత్సం

51కి పెరిగిన మృతులు సహాయక చర్యలు ముమ్మరం

ఆస్టిన్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రాన్ని మెరుపు వరదలు ముంచెత్తాయి. దీంతో అనేక మంది వరదల్లో చిక్కుకుపోయారు. మృతుల సంఖ్య 51కు పెరిగింది. కెర్ కౌంటీలోనే 43 మంది ప్రాణాలు కోల్పోగా, ఇందులో 15 మంది పిల్లలు ఉన్నారు. చుట్టుపక్కల కౌంటీల్లోనూ మరణాలు సంభవించాయి. గల్లంతైన వారి లెక్క కచ్చితంగా చెప్పలేమని అధికారులు తెలిపారు. ఆదివారం హెలికాప్టర్లు, బోట్లు, డ్రోన్ల సహాయంతో గాలింపు చర్యలను మరింత ముమ్మరంగా చేపట్టారు. వరద నీటిలో కొట్టుకుపోయి చెట్లలో చిక్కుకున్న కొందరిని సహాయక సిబ్బంది కాపాడింది. కేర్ కౌంటీలోని గ్వాడలూప్ నది పొంగి చుట్టుపక్కల ప్రాంతాలను ముంచేసింది. తీరంలోని మిస్టిక్ క్యాంపు మునిగిపోగా, శిక్షణ కోసం వచ్చిన వారిలో 27 మంది బాలికలు గల్లంతయ్యారు. వీరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. కెర్‌విల్లే సిటీ మేనేజర్ డల్టాన్ రైస్ స్పందిస్తూ ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సహాయక చర్యలు నిర్విరామంగా సాగుతున్నట్లు తెలిపారు. గత 36 గంటల్లో 850కుపైగా మందిని సహాయక సిబ్బంది కాపాడారని, తమ ప్రాణాలను పణంగా పెట్టి చిన్నారులను రక్షించిన సందర్భాలు ఉన్నాయన్నారు. చీకటి పడిన తర్వాత ఆపరేషన్‌కు ఆటంకం కలగకుండా సహాయక చర్యల్లో కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్లు, విమానాలు పాల్గొంటున్నట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోమ్ వెల్లడించారు. కాగా, ట్రంప్ సర్కారు తరపున అన్ని విధాలా సహాయ, సహకారాలు అందుతాయన్నారు.

ప్రజల ముందుకు ఖామేనీ

తెహ్రాన్: ఇజ్రాయిల్‌తో 12 రోజులు యుద్ధం తర్వాత ఇరాన్ అధినేత ఆయాతుల్లా అలీ ఖామేనీ ఎట్టకేలకు ప్రజల ముందరకు వచ్చారు. మొహరం సందర్భంగా అషురా (ముస్లింలకు పవిత్ర దినం) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఖామేనీ వచ్చినప్పుడు అక్కడ ఉన్న వారంతా లేచి నిలబడి, ఆయనకు మద్దతు తెలిపారు. పిడికిలి బిగించి నినాదాలు చేశారు. ఖామేనీ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగిన దృశ్యాలను ఇరాన్ మీడియా ప్రసారం చేసింది. అయితే ఖామేనీ ఎలాంటి ప్రకటన చేసినట్లు వార్తాలు రాలేదు. కాగా, ఇజ్రాయిల్‌తో యుద్ధంలో తమ వారు 900 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు ఇరాన్ ప్రకటించింది. వేలాది మందికి గాయాలయ్యాయని తెలిపింది. అణు కేంద్రాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. అయితే అమెరికా సంస్థల ద్వారా ఆయా ప్రాంతాల తనిఖీలకు ఇరాన్ అనుమతిని నిరాకరించింది.

'ది అమెరికా పార్టీ' ప్రకటించిన మస్క్

వాషింగ్టన్: టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ కొత్త రాజకీయ పార్టీ పెట్టారు. 'ది అమెరికా పార్టీ'ని ప్రకటించారు. అమెరికన్లకు వారి స్వేచ్ఛను తిరిగివ్వడమే లక్ష్యంగా ది అమెరికా పార్టీ ఏర్పడిందని మస్క్ ప్రకటన చేశారు. ఆయన ఈ వారం మొదట్లో ఆన్‌లైన్‌లో పోల్ నిర్వహించారు. కొత్త పార్టీ పెట్టేందుకు మద్దతు రావడంతో 'అమెరికా పార్టీ'ని ప్రకటించారు. రెండు పార్టీల (కొందరు యూనీ పార్టీగా వ్యవహరిస్తారు) వ్యవస్థ నుంచి విముక్తి కావాలా అని ప్రజలను అడిగేందుకు స్వాతంత్ర్యం వచ్చిన రోజు కంటే శ్రేయస్కరమైన రోజు మరొకటి ఉండదు' అని సామాజిక మాధ్యమంలో మస్క్ పేర్కొన్నారు. కొత్త పార్టీ పెట్టడంపై 1.2 మిలియన్ల మంది స్పందించారని, వారిలో 65 శాతం మందికిపైగా మద్దతు తెలిపారని వెల్లడించారు. సెనేట్‌లో రెండు-మూడు స్థానాలను, 10 హౌస్ డిస్ట్రిక్ట్స్‌లో ఎనిమిది కైవసం చేసుకోవడం కోసం అమెరికా పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు వెళుతుందని మస్క్ తెలిపారు. కాగా, 'ది బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మస్క్‌కు విభేదాల నేపథ్యంలో కొత్త పార్టీ ప్రకటించడం విదితమే.

ఈయూపై చైనా ప్రతీకారం

వైద్య పరికరాల దిగుమతులపై సుంకాలు

బీజింగ్: యూరోపియన్ యూనియన్ నుంచి వైద్య పరికరాల ప్రభుత్వ కొనుగోళ్లను పరిమితం చేస్తున్నట్లు చైనా ఆర్థిక శాఖ ప్రకటించింది. 45 మిలియన్ యువాన్ (6.3 మిలియన్ డాలర్లకు) కంటే ఎక్కువ విలువ ఉంటే మాత్రం ఆంక్షలు వర్తిస్తాయని తెలిపింది. గత నెలలో బ్రసెల్స్ తీసుకున్న చర్యలకు ప్రతీకారంగా చైనా ఈ నిర్ణయం తీసుకుంది. చైనా తయారీ ఎలక్ట్రిక్ వాహనాలపై సుంకాలను యూరోపియన్ యూనియన్ విధిస్తోంది. దీంతో బీజింగ్, బ్రసెల్స్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ప్రతిచర్యగా ఈయూ నుంచి బ్రాందీ దిగుమతులపై బీజింగ్ సుంకాలు విధించింది. ఈయూ తయారీ వస్తువులతో కూడిన ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వైద్య పరికరాలపై ఆంక్షలు-సుంకాలు విధిస్తున్నట్లు చైనా వెల్లడించింది. ఆదివారం నుంచి కొత్త ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. అయితే చైనాలో యూరోపియన్ కంపెనీల నుంచి ఉత్పత్తులపై ప్రభావం ఉండదని ఆర్థిక శాఖ ప్రకటన పేర్కొంది. ప్రపంచంలో రెండవ-మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల సదస్సు చైనాలో జరగనున్న నేపథ్యంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. యూరోపియన్ యూనియన్ బ్రాందీపై ఐదేళ్ల వరకు 34.9 శాతం సుంకాన్ని చైనా ప్రకటించింది. కాగా, పెర్నోడ్ రికార్డ్, ఎల్‌వీఎంహెచ్, రెమీ కోయింట్రూ వంటి బ్రాండ్లకు లెవీల నుంచి మినహాయింపు ఇచ్చింది. అయితే కనీస ధరకు విక్రయించాలని షరతు పెట్టింది. అది ఎంతన్నది మాత్రం చైనా వెల్లడించలేదు.

పాకిస్థాన్ ముసుగులో భారత్‌తో చైనా వైరం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించిందని ఆయన ఉద్దేశం అది కాదని ప్రభుత్వం వ్యాఖ్యానించింది. అసలు ఆయన మాటలను ఎలా అర్థం చేసుకోవాలో మాత్రం చెప్పలేదు. ఒక వేపు పాకిస్థాన్ తో యుద్ధం చేస్తూ మరో వేపు చైనాతో పరోక్ష యుద్ధం చేయాల్సి రావడం అంటే అర్థం ఏమిటి. దానికి భారత్ ఏ మేరకు సిద్ధంగా ఉన్నట్టు?

పాకిస్థాన్ కు అందే సైనిక సామాగ్రిలో చైనా నుంచి అందేవే 81 శాతం దాకా ఉంటాయని ఆయుధ వ్యవహారాలను పరిశీలించే నిపుణులకు తెలిసి ఉండొచ్చు. యుద్ధ తంత్రం, దానికి అవసరమైన ఏర్పాట్లు అన్నీ చైనానే చేసింది. టర్కీ కూడా పాకిస్థాన్ కు భారీ స్థాయిలో డ్రోన్లు సరఫరా చేసింది. ఉపగ్రహం ద్వారా అందే జియో పొజిషనింగ్ వ్యవస్థ (జి.పి.ఎస్.) సమాచారాన్ని చైనా పాకిస్థాన్ కు చైనాకు ఎప్పటికప్పుడు అందిస్తూ వచ్చింది. మనం ఎంత సేపూ పాకిస్థాన్ మీదే దృష్టి పెట్టాం తప్ప చైనాను ఎలా ఎదుర్కోవాలో ఆలోచించలేదు. చైనా తన ఆయుధాలు ఎలా పని చేస్తున్నాయోనని పరీక్షించడం అంటే భవిష్యత్తులో పాకిస్థాన్‌కు మరింత ఆధునిక ఆయుధ సామాగ్రి అందిస్తే మనం చేపట్టవలసిన రక్షణ కార్యక్రమాలపై అవగాహన ఉందా లేదా అన్న అనుమానం కలగక మానదు. ఉపగ్రహాల ద్వారా అందే సమాచారాన్ని పాకిస్థాన్ కు చైనా అందిస్తోంది. భారత్ మీద ఎప్పుడు క్షిపణులు ప్రయోగించాలో చెప్తోంది.

పాక్‌కు చైనా సహాయాన్ని ఎదుర్కొని నిలబడగలిగే శక్తి భారత్ కు ఉందని అనుకోలేం. అయిదో తరం యుద్ధ విమానాలు అంటే జె-35 యుద్ధ విమానాలు పాకిస్థాన్ కు అందితే వాటిని ఎదుర్కొనే సాధన సంపత్తి మనదగ్గర లేదు. గత పదేళ్ల నుంచి ఎలాంటి అయిదో తరం యుద్ధ విమానాలు కావాలి అని ఆలోచిస్తూ కూర్చున్నాం. రష్యా నుంచి అలాంటివి వస్తాయంటున్నారు. రష్యా తో కలిసి ఎస్.యు.57 యుద్ధ విమానాలు ఉమ్మడిగా తయారు చేస్తాం అంటున్నారు. కానీ ఈ ప్రతిపాదన 2018లోనే ఆగిపోయింది. మనమే అయిదో తరం యుద్ధ విమానాలు తయారు చేయాలన్న ప్రణాళికలూ ఉన్నాయి. ఇప్పుడు మొదలు పెట్టినా అవి 2035లో తప్ప సిద్ధం కావు. ఈ పరిస్థితిలో చైనాతో కాదు పాకిస్థాన్ తో కూడా పోరాడే సామర్థ్యం మనకు ఉండకపోవచ్చు.

పాకిస్థాన్ చైనాకు ముసుగు అన్నది మాత్రం సత్యం. పాకిస్థాన్ చాలా చిన్న దేశం కనక భారత్ మీద గెలవలేదని, అందువల్ల భారత్ మీద పరోక్ష యుద్ధమే మేలని 1963లోనే అప్పటి చైనా ప్రధాని చౌ ఎన్ లై అప్పటి పాకిస్థాన్ అధినేత అయూబ్ ఖాన్ కు సలహా ఇచ్చారు.

ప్రత్యక్షంగా భారత్ తో పోరాడకుండా పాకిస్థాన్ ద్వారా ఎందుకు పోరాడుతోంది అని మనం ఎప్పుడు అర్థం చేసుకుంటామో తెలియదు. చైనా నుంచి మనకు అపారమైన సరుకులు అందుతున్నాయి. వాణిజ్యం దగ్గరకు వచ్చే సరికి చైనా మనతో స్నేహంగా ఉన్నట్టు ఉంటుంది. కానీ ఆయుధాలు, సైనిక సాధన సంపత్తి, ఉపగ్రహ సమాచారం అందించేది మాత్రం పాకిస్థాన్‌కే. అంటే రెండు వైపుల నుంచి లబ్ధి పొందే పనిలో చైనా నిమగ్నమై ఉంది. డోక్లాం ఆ తరవాత గల్వాన్‌లో, లద్దాక్ లో చైనా మన భూభాగాల్లోకి చొచ్చుకు వచ్చింది. అందులో భాగంగా నాలుగడుగులు ముందుకు వేసి రెండడుగులు వెనక్కు జరుగుతోంది. అరుణాచల్ ప్రదేశ్ తమదేనన్న వాదన చైనా ఇప్పటికీ వదలలేదు. మన భూభాగాల్లో శాశ్వత నిర్మాణాలు కొనసాగిస్తోంది.

చైనా ఆసియాలో ఆధిపత్యం చెలాయించాలనుకుంటోంది. ముఖ్యంగా దక్షిణాసియా, ఆగ్నేయాసియాలో ఆధిపత్యం సంపాదిస్తోంది. దక్షిణాసియాలో చైనాతో తలపడే స్థితిలో భారత్ మాత్రమే ఉంది. పశ్చిమ దేశాల ఆర్థిక పరిస్థితి దిగజారుతున్న సమయంలో తమతో పోటీ పడగలిగింది భారత్ మాత్రమేనని చైనాకు తెలుసు. అందుకే మన దేశాన్ని ఏదో ఒక రూపంలో వెనక్కు నెట్టాలని ప్రయత్నిస్తోంది. ఆర్థికాభివృద్ధి విషయంలో భారత్ కన్నా చైనా 30-40 ఏళ్లు ముందుంది. మరో ఇరవై ఏళ్ల పాటు మన స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) రెండింతలైనా చైనాను అందుకునే పరిస్థితి లేదు. పాకిస్థాన్ తో వైరానికే భారత్‌ను పరిమితం చేస్తే మన ఎదుగుదలను కట్టడి చేయావచ్చునని చైనా ఎత్తుగడ. కశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని 2019 ఆగస్టు అయిదున తొలగించినప్పటి నుంచే చైనా మన మీద గుర్రుగా ఉంది. పాకిస్థాన్ ను ఎగదోస్తోంది. లద్దాఖ్, అరుణాచల్ ప్రదేశ్ తమవేనని చైనా భావిస్తోంది. ఆక్సాయ్ చీన్ ఇప్పటికీ చైనా అధీనంలోనే ఉంది. చైనా వాణిజ్య మార్గాలకు పాకిస్థాన్ ఎర్ర తివాచీలు పరుస్తోంది. ఆక్రమిత కశ్మీర్ గుండా చైనా వాణిజ్య మార్గాలు ఉన్నాయి. అందుకే పాకిస్థాన్ తో అంటకాగుతోంది.

చైనా ప్రస్తుతం అమెరికాతో పోటీ పడ్తోంది కనుక భారత-అమెరికా సత్సంబంధాలను కూడా భరించలేకపోతోంది. చైనా ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉంది. చైనా ఆర్థిక వ్యవస్థ 19-20 ట్రిలియన్ డాలర్ల మేర ఉంటే మనం 4 ట్రిలియన్ డాలర్ల దగ్గర ఊగిసలాడుతున్నాం. చైనా రక్షణ శాఖ ఒక్క దానికే 4 ట్రిలియన్ డాలర్లు కేటాయించగలదు. చైనా ప్రధాన పోరాటం అమెరికాతోనే. భారత్ తో కాదు. కానీ భారత్ అనూహ్యంగా ఎదగడం చైనాకు ఇష్టం లేదు. కానీ వాణిజ్య సంబంధాలలో మనతో పేచీ పడదు. మన మార్కెట్ విస్తృతే దానికి కారణం. అయితే చైనాతో మన సరిహద్దు వివాదాలు కొలిక్కి రానే లేదు. వివేకవంతమైన దౌత్య నీతి ఉంటే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదు.

మోదీ సర్కారుకు చుక్కలు

(మొదటిపేజీ తరువాయి)

కక్షసాధింపు అంశాలపై మోదీకి టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఐదు ప్రశ్నలు సంధించారు. పహల్గాం ఉగ్రదాడిపై అఖిలపక్ష సమావేశానికి రాకుండా బీహార్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రధానిని ఆ పార్టీ నేతలు తీవ్రంగా విమర్శించారు. చీనాబ్ రైల్వే బ్రిడ్జి తమ కృషి ఫలితమని చెప్పుకోవ దాన్ని ఖండించారు. మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అతల్ బిహారీ వాజ్‌పేయి, రైల్వేశాఖ మాజీ మంత్రి మమతా బెనర్జీ పాత్రను తృణమూల్ ఎంపీలు డెరెక్ ఓ బ్రెయిన్, సాగరికా ఘోష్ గుర్తుచేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా తనదైన శైలిలో కేంద్రంపై విమర్శనాస్త్రాలు సంధిస్తుంటారు. పహల్గాంలో పర్యాటకులకు రక్షణ కల్పించ డంలో వైఫల్యాన్ని ఎత్తి చూపారు. ఇంటెలిజెన్స్ వైఫల్యాన్ని కప్పిపుచ్చు కునేందుకు ఆపరేషన్ సిందూర్ చేపట్టారని అఖిలేశ్ ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారంతో రాజకీయంగా లబ్ధి పొందాలను కున్న మోదీ ప్రభుత్వానికి ప్రతిపక్ష నాయకుల ప్రశ్నలు, విమర్శలతో ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఆ అంశంపై ప్రస్తావనలను తగ్గించుకున్నది. అధికరణ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదమే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పిన కొద్ది వారాల్లో పహల్గాం ఘటన జరి గింది. ఉగ్రవాదులను పట్టుకోలేకపోవడాన్ని ప్రతిపక్షాలు ఖండించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి పాక్‌తో కాల్పుల విరమణను ఒప్పుకున్నారని మోదీని ప్రతి పక్షాలు ఎండగట్టాయి. అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో భారతీయ విద్యార్థితో పోలీసుల దుష్ప్రవర్తన దృశ్యాలపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మండిపడ్డారు. అమెరికాలో భారతీయులతో దుష్ట ప్రవర్తనను ఎందుకు ప్రశ్నించడం లేదని మోదీని నిలదీశారు. ఆ మరునాడే న్యూఢిల్లీలోని అమెరికా దౌత్యకార్యా లయంతో కేంద్ర విదేశీ వ్యవహా రాల శాఖ మాట్లాడింది. 'వైమానిక దాడి గురించి పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం ఇవ్వడాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు ముందే దాడుల గురించి చెప్పడం నేరమ న్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం చేసినట్లు విదేశీ వ్యవహారాల శాఖ బహిరంగంగానే చెప్పిందన్నారు. ఇందుకు ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఫలితంగా ఎన్ని యుద్ధ విమానాలను భారత్ కోల్పో యింది? అని రాహుల్ ప్రశ్నిం చారు. నిజానిజాలు దేశానికి తెలియాలన్నారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్, సంబంధిత అంతర్జాతీయ పరిణామాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని 16 ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కొందరు ప్రముఖులు కూడా ఇదే డిమాండ్ చేశారు. అలాంటి చర్చ జరగలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వివాదాస్పద అంశాలపై చర్చ నుంచి తప్పించుకోవడం మోదీ ప్రభుత్వానికి కొత్తేమీ కాదు. అయితే ఒత్తిడి పెరగడంతో 47 రోజులు ముందుగానే పార్లమెంటు వర్షాకాల సమావేశాల తేదీలను కేంద్రం ప్రకటించింది. ప్రత్యేక చర్చ కోసం డిమాండ్‌ను అణచివేసే ప్రయత్నమంటూ జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. భారత విదేశాంగ విధానంపై అఖిలపక్షంతో చర్చకు ప్రధాని ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇదే క్రమంలో 'సరేంద్ర సరెండర్' (సరేంద్రుడు లొంగిపోయాడు) అని రాహుల్ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నాయకుల ఒత్తిడితో వారికి బదులివ్వడం కోసం తమ ప్రతినిధులు గౌరవ్ భాటియా, సంబిత్ పాత్రకు బదులుగా బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను మోదీ ప్రభుత్వం రంగంలోకి దింపింది. దీంతో సాయుధ దళాలను అవమానించారంటూ రాహుల్‌పై గోది మీడియా, బీజేపీ సోషల్ మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి ముప్పేట దాడి జరిగింది. ఓపినీయన్ పోల్స్‌ను సైతం వార్తాఛానళ్లు నిర్వహించాయి.

గత నవంబరులో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్‌పై ఓ ఆంగ్ల పత్రికలో రాహుల్ గాంధీ వ్యాసం రాశారు. వేరొక చోట రిగ్గింగ్ కోసం ఇది బ్లూప్రింట్ అని వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలను తిప్పికొట్టడం కోసం జాతీయ నాయకులతో పాటు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కేంద్రం పురమాయించింది. ఎన్నికల సంఘాన్ని సమర్థిస్తూ వార్తా సంస్థలకు ఫడ్నవీస్ ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఈసీ కార్యాలయం స్పందన వచ్చింది కానీ నేరుగా ప్రధాన ఎన్నికల కమిషన్ లేదా ఇతర కమిషన్లు స్పందించలేదు. ఈ వైఖరిని ప్రతిపక్ష నాయకుడు తప్పుపట్టారు. సీఈసీ నోరు విప్పేందుకు నాలుగు రోజులు పట్టింది. అదీ అంతర్జాతీయ మాధ్యమంగా... అని రాహుల్ దుయ్యబట్టారు. ఏదిఏమైనా పాక్‌తో కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడంతో మోదీ వన్నె కోల్పోయారు. ఆయనకు గొప్పలు చెప్పుకునే అవకాశాన్ని ప్రతిపక్షాలు ఇవ్వలేదు. వృద్ధి రేటు స్తంభన, పెరుగుతున్న నిరుద్యోగం, ఆకలి కేకలు, అమలు చేయని హామీలు, అవినీతి వంటి అనేక అంశాలపై ఎప్పకటిప్పుడు ఎండగడుతూ మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర ఒత్తిడి తెచ్చారు. సర్కారు ప్రగల్భాలను కొంత మేరకు కట్టడి చేయడంలో సఫలమైంది.

పేదరికం పెరిగిపోతోంది

(మొదటిపేజీ తరువాయి)

వికేంద్రీకరణ జరగాలని, ఈ దిశగా అనేక మార్పులు జరిగాయని గడ్కరీ అన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టిన ఘనత మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందని ఆయన చెప్పారు. కానీ ఆ వృద్ధి నమూనాను అదుపులేని కేంద్రీకరణగా పరిణామం చెందదానికి అనుమతించకూడదని హెచ్చరించారు. 'మనం దాని గురించి ఆందోళన చెందాలి' అని ఆయన అన్నారు, ముఖ్యంగా గ్రామీణ భారతదేశంలో ఉపాధిని సృష్టించే సంస్కరణలు జరగాలన్నారు. స్వామి వివేకానందను ప్రస్తావిస్తూ... 'కడుపు ఖాళీగా ఉన్న వ్యక్తికి తత్వశాస్త్రం బోధపడదు' అని వ్యాఖ్యానించారు. సైద్ధాంతిక లేదా ఆర్థిక సిద్ధాంతాలను అనుసరించే ముందు పేదరికాన్ని పరిష్కరించాల్సిన తక్షణ అవసరాన్ని నొక్కి చెప్పారు. కాగా ప్రస్తుతం టోల్ ఆదాయం సంవత్సరానికి రూ.55,000 కోట్లుగా ఉందని, రెండు సంవత్సరాలలో రూ.1.40 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నామన్నారు. 'రాబోయే 15 సంవత్సరాలలో మనం టోల్ ఆదాయాన్ని మోనటైజ్ చేస్తే, మనకు ఆ12 లక్షల కోట్లు ఉంటాయి' అని గడ్కరీ తెలిపారు. అంతర్జాతీయ రుణాలపై ఆధారపడకుండా భారతదేశం తన స్వంత మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చుకునే సామర్థ్యాన్ని నొక్కి చెప్పారు.

మోదీ వైఫల్యాల సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. గురువింద గింజ సామెతను గుర్తు చేసే విధంగా లేఖ ఉందని దుయ్యబట్టారు. 'తెలంగాణకు గత 11 ఏళ్లలో ఏం చేశారు? కేంద్రం రూపాయి ఇవ్వనప్పుడు మీరు, రాష్ట్రంలోని బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఏం చేశారు? 10 లక్షల కంద్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి పదేళ్ల కిందట ఇచ్చిన హామీ ఏమైంది? పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తోంది మీరు కాదా! పోలవరం ముంపుతో సంబంధం లేని ఐదు పంచాయతీలను ఏపీలో విలీనం చేసి భద్రాద్రి రామయ్య భూములను అప్పనంగా ఇచ్చింది మీరు కాదా!' అని మంత్రి ప్రశ్నించారు. అడుగడు గున తెలంగాణ ప్రజలను వంచించిన మీరు మాకు లేఖలు రాస్తారా? చేతనైతే మోదీకి లేఖ రాసి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయమని చెప్పండి అని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

చంద్రచూడ్ బంగ్లా ఖాళీ చేయించండి

(మొదటిపేజీ తరువాయి)

టైప్-7 ప్రభుత్వ బంగ్లాలో ఆరు నెలల పాటు అద్దె చెల్లించకుండానే ఉండొచ్చని, ఆ గ్రేస్ పీరియడ్ కూడా ఇప్పటికే గడిచిపోయిందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం సీజేఐగా ఉన్న వారికి టైప్-8 అధికారిక బంగ్లాను కేటాయించాల్సి ఉన్నందున, దాన్ని వెంటనే ఖాళీ చేయించాలని కోరింది. టైప్-8 అధికారిక బంగ్లాలో నివసించేందుకు మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు ఇచ్చిన గడువు ఈ ఏడాది మే 31తోనే ముగిసిందని తెలిపింది. అధికారిక క్వార్టర్స్‌లో ఉండేందుకు మంజూరు చేసే ఆరు నెలల గ్రేస్ పిరియడ్ కూడా ఈ ఏడాది మే 10తోనే గడిచిపోయిందని సుప్రీంకోర్టు పాలనా విభాగం గుర్తుచేసింది.

నాకు బాధ్యతలు తెలుసు: చంద్రచూడ్

ఈ విషయమై జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. తప్పనిసరి వ్యక్తిగత కారణాలతో ఆలస్యం జరిగిందని తెలిపారు. ఈ విషయం సైతం యంత్రాంగానికి తెలుసునన్నారు. తనకు ప్రత్యేక అవసరాలున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారని... వారి ఆరోగ్య పరిస్థితి (నెమాలిన్ మయోపతి) నేపథ్యంలో వారి కోసం అనువుగా ఉండే ఇల్లు చూసుకునేందుకు కొంత సమయం పట్టిందన్నారు. ప్రభుత్వం తనకు ప్రత్యామ్నాయ వసతి కేటాయించిందని.. అయితే, ఆ ఇల్లు చాలాకాలం మూసి ఉండడంతో కొన్ని మరమ్మతులు జరుగుతున్నాయని.. పూర్తయిన వెంటనే అందులోకి మారిపోతానని స్పష్టం చేశారు. తాను అత్యున్నత పదవిలో పని చేశానని... బాధ్యతలు తనకు తెలుసునన్నారు. కొద్దిరోజుల్లోనే సమస్య పరిష్కారమవుతుందని స్పష్టం చేశారు. అయితే, సుప్రీంకోర్టు యంత్రాంగం ఓ మాజీ సీజేఐని అధికారిక నివాసం ఖాళీ చేయాలని ప్రభుత్వానికి లేఖ రాయడం ఇదే తొలిసారి.

డీఎస్సీ 'ప్రతిస్పందన' గందరగోళం

- సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు
- ఎస్జీటీ పరీక్షలో జవాబులు తారుమారు
- మంత్రి లోకేశ్ స్పందించాలని అభ్యర్థనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డీఎస్సీ 2025 ప్రతిస్పందన షీట్లు గందరగోళంగా మారింది. జూన్ 6 నుంచి 28వరకు డీఎస్సీ పరీక్షలను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. వివిధ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీలు, ప్రతిస్పందన షీట్లను ఈనెల 3వ తేదీ నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఎస్జీటీ పరీక్షలో ఈ సాంకేతిక తప్పిదాలు దొర్లినట్లుగా సామాజిక మాధ్యమంలో అభ్యర్థులు తమ గోడును వెల్లడిస్తున్నారు. కాగా, జూన్ 18వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్జీటీ పరీక్షను జి.ప్రసాద్ అనే అభ్యర్థి మొత్తం 150 ప్రశ్నలకు జవాబులు రాయగా... కీ, ఐచ్ఛిక ఎంపికలను పరిశీలించాక అనేక అనుమానాలను వ్యక్తం చేశాడు. తాను పెట్టిన జవాబుకు ఐచ్ఛికం ఎంపిక దగ్గర ఎక్కువ ప్రశ్నలకు ఖాళీగా చూపడం, అక్కడక్కడా మాత్రమే సరైన జవాబు ఎంపికను చూపినట్లు తెలుపుతున్నారు. అలా మొత్తంగా కేవలం 10 ప్రశ్నలకే లెక్కించడంతో అనుమానాలు తలెత్తాయి. దీంతో సదరు అభ్యర్థికి ఆప్షన్లలో నమోదైన మేరకు 10 ప్రశ్నలకే మొత్తం మార్కులను లెక్క కడతారేమోనన్న ఆందోళన వెంటాడు తోంది. అభ్యర్థులు పెట్టిన ఆప్షన్‌కు బదులుగా మరో ఆప్షన్ చూపించినట్లుగా చెబుతున్నారు. కొన్ని ప్రశ్నలకు తాము పెట్టిన జవాబులు మారిపోయాయని పేర్కొంటున్నారు. ఎస్ఏ బయాలజీ రాసిన ఓ అభ్యర్థి కూడా ప్రతిస్పందన షీటును పరిశీలిం చాక... తాను పెట్టిన దానికి అనుగు ణంగా జవాబులు లేవని వాపోతు న్నాడు. నెల్లూరు జిల్లాలో జూన్9వ తేదీ మధ్యాహ్నం జరిగిన ఫిజికల్ సైన్స్ పేపరు రాసిన మరో అభ్యర్థికి అతడు పెట్టిన జవాబులకు బదు లుగా మరో జవాబులు రెస్పాన్స్ షీట్లలో పొందుపరిచినట్లుగా చెబుతున్నారు. దీని ఆధారంగా రెస్పాన్స్ షీట్‌కు ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌లో అనేక తప్పిదాలు దొర్లినట్లుగా అభ్యర్థుల్లో ఆందోళన ఉంది. డీఎస్సీ అభ్యర్థులు తమ వ్యక్తిగత ప్రతిస్పందన పత్రాలను తనిఖీ చేసుకోవచ్చని, ప్రాథమిక కీలపై వారికి ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ఈనెల 11న లేదా అంతకుముందు https://apdsc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా చెల్లుబాటు అయ్యే రుజువులతో వాటిని సమర్పించాలని కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఆదేశించారు. దీంతో డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థులు ప్రాథమిక కీలు తెలుసుకునే క్రమంలో వారు పెట్టిన జవాబుల ప్రతిస్పందనలు విభిన్నంగా రావడంతో దిక్కుతోచడం లేదు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి ప్రాథమిక కీలు, ప్రతిస్పందనల్లో నెలకొన్న సాంకేతిక సమస్యల్ని పరిష్కరించి, ప్రతిభగల విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నారు.

రాయిటర్స్ 'ఎక్స్' ఖాతా స్తంభన

(మొదటిపేజీ తరువాయి)

వచ్చింది కాదని ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించింది. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని తెలిపింది. పీటీఐ నివేదిక ప్రకారం... మే 7న కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' సమయంలో కొన్ని సోషల్ మీడియా ఖాతాలపై చర్యలు తీసుకోవాలని 'ఎక్స్'ను ఆదేశించింది. అయితే ఆ సమయంలో రాయిటర్స్ ఖాతాపై ఎలాంటి చర్య తీసుకోలేదని, ఇప్పుడు ఆ ఆదేశాన్ని ఆలస్యంగా అమలు చేసి ఉండొచ్చని, ఇది ప్లాట్‌ఫామ్ వైపు నుంచి జరిగిన పొరపాటు కావచ్చని భావిస్తున్నారు.

పనిచేయని ఖాతాలు

రాయిటర్స్, రాయిటర్స్ వరల్డ్ వంటి అకౌంట్లు పనిచేయడంలేదు. కానీ, రాయిటర్స్ ఆసియా, రాయిటర్స్‌టెక్, రాయిటర్స్ ఫ్యాక్ట్‌చెక్ వంటి ఇతర ఖాతాలు మాత్రం ప్రభావితం కాలేదు. అవి భారత్‌లో యథావిధిగా యాక్సెసబుల్‌గా ఉన్నాయి. కాగా, ఇప్పటివరకు రాయిటర్స్ సంస్థ దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. యూకేకు చెందిన ఈ వార్తా సంస్థ ఎందుకు బ్లాక్ చేశారు? ఇది తాత్కాలికమేనా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా, ఎక్స్‌ను సంప్రదించిన కేంద్రం.. ఎందుకు ఇలా జరిగిందో వివరణ కోరింది. రాయిటర్స్ ఖాతా పునరుద్ధ రణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపింది. కాగా, ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా మీడియా తప్పుడు కథనాలు ప్రచురించడాన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. దీనిపై నిరసన తెలిపిన భారత్... దేశంలోకి చైనా గ్లోబల్ టైమ్స్ ఖాతాలను స్తంభింపజేసిన విషయం విదితమే.

ప్రజావసరాలే అజెండా

(మొదటిపేజీ తరువాయి)

దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామన్నారు. రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నామని, పేదవారిపై భారం పడకుండా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ పంపిణీ చేస్తున్నామని వివరించారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న పని చేసుకునే ఓపిక ఉన్న వారి కోసం ఉపాధి కార్డు ఇచ్చి 100 రోజుల పని కల్పిస్తున్నాం, ఇంట్లో చదువుకునే పిల్లలు ఉంటే రెసిడెన్షియల్ విద్యార్థులకు 40 శాతం డైట్ 200 శాతం కాస్మోటిక్స్ చార్జీలు పెంచామని తెలిపారు. కాలేజీలకు వెళ్లే పిల్లల కోసం ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నాం, చదువు పూర్తి చేసుకున్న వారి కోసం 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని వివరించారు. చదువుకున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం రాక శక్తి, ఆసక్తి ఉన్న యువత కోసం 8,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం అనే స్వయం ఉపాధి పథకాన్ని తీసుకువస్తున్నాం అని డిప్యూటీ సీఎం అన్నారు. ఇంట్లో వారికి ఆరోగ్యం బాగా లేకపోతే 10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం చేయించుకునే అవకాశాన్ని ప్రజా ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర తోపాటు సన్న ధాన్యం పండించిన రైతులకు బోనస్ కింద క్వింటాకు 500 రూపాయలు చెల్లిస్తున్నాం అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశాం ఇందుకోసం 21 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. రుణమాఫీ తో పాటు పెట్టుబడి సాయం కింద ప్రతి సంవత్సరం సీజన్ కు రూ.ఆరు వేల చొప్పున రూ.12 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం, ఈ సీజన్ కు తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ.తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. మహిళల కోసం ఇందిరా క్రాంతి పథం ద్వారా డ్వాక్రా సంఘాలకు ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యం పెట్టుకున్నట్టుట పేర్కొన్నారు.

చెంచులకు 13 వేల ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆసిఫాబాద్ 3371, బోథ్ 163, ఖానాపూర్ 2257, సిర్పూర్ 227, అదిలాబాద్ 2848, బెల్లంపల్లి 223, భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వరావుపేట 274, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్‌లో (2156) అచ్చంపేట్ 785, మహబూబ్‌నగర్ 245, పరిగి 63, తాండూర్ 174, కొల్లాపూర్ 105, కల్వకుర్తి 120, వికారాబాద్ 63, దేవరకద్ర 64, నాగార్జునసాగర్ 17... మొత్తంగా 13,266 ఇళ్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి రూ.3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అయితే ఐటీడీఏ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇళ్లు చొప్పున 8,750 ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్ నమోదు

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా లాగిన్ అయి..ఫీజు చెల్లింపు, నమోదు ప్రక్రియ చేసుకోవచ్చు. ఓసీ, బీసీలు రూ.1200, ఎస్సీ, ఎస్టీలు రూ.600 చొప్పున ఫీజు చెల్లించి తమ పుట్టిన తేదీ/ఏపీఈఏపీసెట్ హాల్‌టిక్కెట్ నంబరు ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలి. ఇందులో ఏపీఈఏపీసెట్ 2024లో ఆయా కళాశాలు, బ్రాంచిలకు కటాఫ్‌గా నిలిచిపోయిన చివరి ర్యాంకుల వివరాలను కేటగిరీల వారీగా ఉంచారు. వెబ్ ఆప్షన్లు 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. 19వ తేదీన సవరణలు, 22న సీట్లను ఖరారు చేస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో 23 నుంచి 26లోపు రిపోర్టు చేయాలి. ఆగస్టు 4 నుంచి ఇంజినీరింగ్ కళాశాలలు ప్రారంభమవుతాయి. కౌన్సెలింగ్‌లో పాల్గొనే వారంతా 9 రకాల సర్టిఫికెట్లను సిద్ధం చేసుకుని, వాటిని ఆన్‌లైన్లో పొందుపరచాలి. అభ్యర్థుల సందేశాల్ని నివృత్తి చేసేందుకుగాను హెల్ప్ డెస్క్ నంబర్లు 7995681678, 7995865456 ఏర్పాటు చేశారు.

మానవ హక్కులపై షార్ట్ ఫిల్మ్ పోటీలు : కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు బ్యూరో: జాతీయ మానవ హక్కుల కమిషన్, (ఎన్ హెచ్ఆర్సి) న్యూఢిల్లీలోని మానవ హక్కులపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నదని, 2025 సంవత్సరానికి గాను 11వ ఎడిషన్ షార్ట్ ఫిల్మ్ పోటీలు ప్రకటించబడినట్లు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చునని, మానవ హక్కులపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ల పోటీలలో పాల్గొనే వారు ఆగస్టు 31, 2025 లోగా nhrcshortfilm@gmail.com కు దరఖాస్తుతో పాటు రూపొందించిన 3 నుండి 10 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్ పంపించాల్సి ఉంటుందని అన్నారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతి రెండు లక్షలు, ద్వితీయ బహుమతి లక్ష యాభై తృతీయ బహుమతి లక్ష రూపాయలు నగదు బహుమతి ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : సీఎం రిలీఫ్ ఫండ్ 52500 చెక్కును నేరేడుచర్ల పట్టణానికి చెందిన షేక్ గౌస్‌కు ఆదివారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకల సందీప్ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ఆసుపత్రుల్లో వైద్యం కొరకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అలాంటి నిరుపేదల కోసమే సీఎం రిలీఫ్ ఫండ్ కొంత ఊరట నిస్తుందన్నారు. ప్రస్తుతం పట్టణంలోని అన్ని విధాల అభివృద్ధికై నీటిపారుదల శాఖ మంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నేరేడుచర్లలోని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్స్య పరిశ్రమ నేరేడుచర్ల చైర్మన్ పేరబోయిన వీరయ్య నేరేడుచర్ల బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జంగిలి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొనతం రామిరెడ్డి నాయకులు బొల్లెద్దు నాగరాజు, ఇంజమూరి శ్రీకాంత్, మెండే జాను, వాసు పాల్గొన్నారు.

సింగరేణిలో పెద్దఎత్తున వనమహోత్సవం

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : సింగరేణిలో అంతటా పెద్దఎత్తున వన మహోత్సవం కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటుతున్నామని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం అన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆర్జీ వన్ ఏరియాలో జనరల్ మేనేజర్ జి.లలిత్ కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు నాటడం వల్ల పర్యావరణం బాగుంటుందని, ఇది మానవాళి ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. మొక్కల్ని నాటడమే కాకుండా వాటిని పరిరక్షించడము వలన భావితరాలకు ఎంతో మేలు చేసిన వారమవుతామని తెలిపారు. ప్రతి ఒక్కరు వారి జీవితంలో ఒక బాగంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని ఇట్టి నాటిన ప్రతి మొక్కను పరిరక్షించలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి, డిప్యూటీ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, నాయకులు కె.స్వామి, ఆరెల్లి పోషం, సిఎంఓఎఐ అధ్యక్షులు బి. మల్లేష్,సేవా అధ్యక్షురాలు అనిత లిలిత్ కుమార్, యస్.ఓ.టు జీఎం ఆంజనేయ ప్రసాద్, డీజీ.ఎం ఫారెస్ట్ కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - తొర్రూరు: గ్రామీణ ప్రాంతాల చిన్నారులకు అందించే మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ కె. రాజేందర్ రెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎదురుగా పిల్లల వైద్యులు డాక్టర్ రమణారెడ్డి కోమటిరెడ్డి, డాక్టర్ హరిత రెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ చక్ర పిల్లల హాస్పిటల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని చిన్నపిల్లల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ యాదగిరి రెడ్డి, డాక్టర్ సురేష్ నాయక్, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, నాగిరెడ్డి, పాకాల వెంకట్ రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెంబి,ఖానాపూర్ మండలాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సైనికుడిలా ప్రజలకు పనులు చేయాలి అని బోధించారు తదుపరి మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరంపలు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సింగపూర్ గ్రామంలో పిరిలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల రమేష్ దొనికేని దయానంద్ రాజు, సత్యం తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి రద్దు : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : జులై 7 (నేడు) సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం జులై 8న మహబూబాబాద్, కేసముద్రం మండలాలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన ఉన్నందున జిల్లా స్థాయి అధికారులందరు క్షేత్రస్థాయిలో అట్టి పనుల్లో నిమగ్నమై ఉన్నారని, అందుబాటులో ఉండనందున ప్రజల సౌకర్యార్థం వారికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.కావున జిల్లాలోని ప్రజలు ప్రజావాణి రద్దు విషయం గమనించి, దరఖాస్తులతో ఈ సోమవారం కార్యాలయానికి రావద్దని కోరారు.

ఊహాజనిత మాటలు మా ప్రభుత్వానికి చేతకాదు

మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : గత టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలో ప్రజలను దగా చేస్తూ వచ్చిందని తమకు అలా మోసం చేయటం రాదని ఇచ్చిన వాగ్దానాలన్నిటిని నెరవేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణాల, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. డబల్ బెడ్ రూమ్‌ల పేర కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు సంపాదించేలా చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం అక్కడక్కడ నామమాత్రపు ఇల్లు కట్టి ప్రజలను ఊహల్లో ఉండేలా మాయ మాటలు చెప్తూ వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం స్పష్టమైన హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చే పనిలో నిమగ్నమైందన్నారు. కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ తమ హక్కులను ఇప్పించే బాధ్యత తీసుకుందన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఇందిరమ్మ ఇళ్ల పత్రాలతో పాటు నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి, సుజాత నగర్, పాల్వంచ, చుంచుపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుల చేతుల మీదుగా అందించారు. అదేవిధంగా ఎస్ఆర్ టి, మాయాబజార్ నిర్వాసితులకు ఇండ్ల స్థలాల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదన్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ప్రతి ఇంటిలో ఆర్థిక వెసులుబాటు కలిగిందన్నారు. ఇందిరమ్మ వీళ్ళ విషయంలో నిర్మాణం చేసుకుం టున్న ప్రతి లబ్ధిదారుల ఖాతాలో ప్రతీ సోమవారం వారి వారి అకౌంట్లలో డబ్బులు జమ చేస్తున్నామ న్నారు. తొలి ఏకాదశి రోజున ఆడబిడ్డలకు ఇంది రమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు ఇవ్వడం శుభ పరిణామని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇండ్ల నిర్మాణం వడివడిగా జరుగుతుందన్నారు. భవిష్యత్తులో గుడి లేని గ్రామం ఉంటుందేమో కానీ ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామం ఉండదన్నారు. దీనికోసం కట్టుబడి పని చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ తో పాటు కాంగ్రెస్ సిపిఐ పార్టీ నాయకులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు లేవు... పదవి విరమణలే...

జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ పాలనలో రిటైర్మెంట్స్ తప్ప రిక్రూట్మెంట్స్ లేదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ఆరోపించారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాల కల్పన కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు దారాదత్తం చేయడం తో కోట్లాది మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం నగర ఐదవ మహాసభ ఆదివారం సెయింట్ మేరీస్ హైస్కూల్లో జరిగింది. సభకు ముందు నగరంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి మహాసభ ప్రాంగణం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సిపిఐ సీనియర్ నాయకులు, ఖమ్మం మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో ప్రభుత్వ రంగం నిర్వీర్యమైందని దేశ సంపదను ప్రైవేటుకు దారాదత్తం చేయడంలో మోడీ రికార్డు సృష్టించారని ఎద్దేవా చేశారు. అలీన విధానానికి కేంద్ర ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగులకు మడుగులొత్తుతు న్నారని, యుద్ధోన్మాదిగా వ్యవహరిస్తున్న ట్రంపో ప్రపంచానికి ఇబ్బందికర పరిస్థితులు దాపురించాయ న్నారు. అటువంటి ట్రంపు మోడీ ఏజెంట్గా మారాడని హేమంతరావు విమర్శించారు. మోడీ పాలనలో కార్పొరేట్లు తప్ప సామాన్యులెవరు సుఖంగా లేరని పదేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు 114 శాతం పెరిగాయని తలసరి ఆదాయం తగ్గి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని, హామీల అమలుకు వెంటనే పూనుకోవాలని హేమంతరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్కు సిపిఐ కట్టుబడి ఉందన్నారు.

సంక్షిప్త స్థితిలో దేశ రాజకీయాలు : పువ్వాడ

సంక్షిప్త స్థితిలో దేశ రాజకీయాలు ఉన్నాయని ఈ స్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. దేశ సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుందని ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. మహాసభలో ప్రారంభ ఉపన్యాసం చేసిన పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిస్టులు బలపడితే సమాజానికి శ్రేయస్కరమన్నారు. బలపడేందుకు మహాసభల్లో కార్యాచరణ రూపొందించుకోవా లని పువ్వాడ సూచించారు. జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఏనుగు గాంధీ, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మీనారాయణ, తాటి నిర్మల, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, మోహన్రావు, జాకీర్ పాల్గొనగా మహాసభకు వరదా నర్సింహారావు, కె. సతీష్రెడ్డి, నామ విజయ్కుమార్, ఆముదాల వెంకన్న అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

9న సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలి

విశాలాంధ్ర - భద్రాచలం : ఎంతో మంది అమరుల ప్రాణాలతో సాధించు కున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా తెస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు టౌన్ కన్వీనర్ బండారు శరత్ బాబు డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఆదివారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మిక కర్షకులే కాకుండా ప్రజలందరూ మద్దతు పలికి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి వైవి రామారావు అధ్యక్షత వహించగా, శరత్ బాబు మాట్లాడారు. దశబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానానికి బదులు 10 గంటల పని విధానం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్ల పక్షపాతి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేయాలని ప్రయత్నం చేస్తుందన్నారు. ఇటువంటి కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి నర్సారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సమ్మె విషయం విస్తృతంగా ప్రజల్లోకెళ్ళిందని 9 న జరిగే ర్యాలీని ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గడ్డం స్వామి, సిఐటియు నాయకులు పారెల్లి సంతోష్ కుమార్, కొలగాని రమేష్, నకరికంటి నాగరాజు, ఎస్ అజయ్ కుమార్ అప్పారి రాము, గుమ్మడి నాగరాజు, ఎస్ భూపేందర్, పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న మోడీ సర్కార్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: మోదీ ప్రభుత్వం పేదల సొమ్మును దోచుకొని కార్పొరేషన్ సంస్థలకు కట్టబెడుతున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాలోని కురివి మండల కేంద్రంలోని జరిగిన సిపిఐ మూడవ మహాసభ కు రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబ లక్ష్మి, తురక రమేష్, వెలుగు శ్రావణ్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. అనంతరం తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు పాల్గొని మాట్లాడుతూ మోడీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారు. ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతున్నారని ఎద్దేవ చేశారు. కేంద్రంలో బిజెపి అధికారం లోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని, కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ ను పరుస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తూ ప్రజల సంక్షేమం మరిచారని అన్నారు. రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను మంటగలుపుతు న్నారని అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలో జాతీయవాదం పేరుతో హిందుత్వ ఏజెండాతో ముస్లిం, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులపై విషం కక్కుతూ ప్రశ్నించే గొంతుకను నొక్కుతున్నారని అన్నారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్రం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఆందోళన చెందుతున్నారని,అలాగే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రంమావోయిస్టులపై చేపట్టిన మారణకాండను నిలిపివేసి తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

సాస్ ప్లాట్‌ఫామ్ 'పినాకా'ను విడుదల చేసిన అలెక్టా సొల్యూషన్స్

హైదరాబాద్: యుఎస్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన టెక్నాలజీ కన్సల్టింగ్, ఉత్పత్తి అభివృద్ధి సంస్థ అయిన అలెక్టా సొల్యూషన్స్,హైదరాబాద్‌లోని అవ్యయ్ బాంకెట్స్‌లో జరిగిన ప్రత్యేకమైన 'పినాకా స్టెల్లార్' ప్రీ-లాంచ్ వేడుకలలో దాని ప్రధాన సాస్ ప్లాట్‌ఫామ్ పినాకాను విడుదల చేయటం ద్వారా దాని ప్రపంచ విస్తరణ వ్యూహంలో ఒక ప్రధాన మైలురాయిని చేరుకుంది. 2016లో అనుభవజ్ఞుడైన టెక్ వ్యవస్థాపకుడు శ్రావణ్ బెలే (వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్టా సొల్యూషన్) ప్రారంభించిన అలెక్టా సొల్యూషన్స్, యూఎస్‌లో విస్తృత స్థాయిలో కార్యకలాపాలను నిర్వహిస్తుండటంతో పాటుగా ఆసియాలో అభివృద్ధి చెందుతున్న కార్యకలాపాలతో, భావితరపు ఆలోచనలు కలిగిన సాంకేతిక భాగస్వామిగా వేగంగా వృద్ధి చెందింది. కంపెనీ తాజా ఆవిష్కరణ, పినాకా, సాంకేతికత ఆధారిత పరివర్తన ద్వారా ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాలను శక్తివంతం చేయడంలో వ్యూహాత్మక ముందడుగును సూచిస్తుంది. పినాకా అనేది తదుపరి తరం, ఏఐ -ఆధారిత సాస్ ప్లాట్‌ఫామ్. ఇది ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఈఆర్ పి), పాయింట్ ఆఫ్ సేల్ (పిఓఎస్), ఫిన్‌టెక్ సొల్యూషన్స్, ఏఐ-ఆధారిత వ్యాపార మేధస్సును సజావుగా అనుసంధానిస్తుంది.

యమహా రేజర్ 125 ఫై హైబ్రిడ్‌పై రూ.10,000 ధర తగ్గింపు

ముంబయి: యమహా మోటార్ కంపెనీ లిమిటెడ్ (వైఎంసీ) నేడు తన 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని వేడుక చేసుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు ఆవిష్కరణ, పనితీరు, రైడింగ్ ఉత్సాహాన్ని అందించే తన ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. 1955 నుండి, యమహా తన ఛాలెంజర్ స్ఫూర్తికి కట్టుబడి ఉంది. లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చే ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని, మొబిలిటీ పట్ల మక్కువను కలిపింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని గుర్తుచేసుకోవడానికి, ఇండియా యమహా మోటార్ తన ప్రసిద్ధ రేజర్ 125 ఫై హైబ్రిడ్, రేజర్ 125 ఫై హైబ్రిడ్ స్ట్రీట్ ర్యాలీ రూ.7,000 ప్రైస్ బెనిఫిట్‌ను అందిస్తోంది. ఈ పరిమిత-కాల వేడుక ఆఫర్ దశాబ్దాలుగా కొనుగోలుదారుల నిరంతర నమ్మకం, మద్దతుకు గాను కస్టమర్లకు ధన్యవాదాలు తెలిపే మార్గం. ఈ ప్రయోజనంతో, కస్టమర్‌లు ఇప్పుడు తుది ఆన్-రోడ్ ధరపై రూ.10,000 వరకు ఆదా చేయవచ్చు. ఈ ఆఫర్‌లో పరిశ్రమలో గొప్పదైన యమహా 10-సంవత్సరాల 'టోటల్ వారంటీ' కూడా ఉంది, ఇది రేజర్‌ను 125సీసీ సెగ్మెంట్‌లో మరింత ఆకర్షణీయమైన ఎంపికగా చేస్తుంది.

ప్రైమ్ డేకి సౌందర్య ప్రేమికులతో అమేజాన్ బ్యూటీ వెర్స్ 2025

ముంబయి: బెల్లా విటా, విష్ కేర్, యాక్సిస్-వై సహకారంతో మేబిలైన్ సమర్పించు అమేజాన్ బ్యూటీ వెర్స్ రెండవ ఎడిషన్‌తో అమేజాన్ ఇండియా ముంబయిని ఈ రోజు సౌందర్య ఆవిష్కరణగా మార్చింది. ప్రైమ్ డే 2025 (జులై 12-14) కి ముందు నిర్వహించ బడిన ఈ ఆహ్వానితులకు మాత్రమే కార్యక్రమం లీనమయ్యే సౌందర్య అనుభవం కోసం వర్క్ షాప్స్ కోసం ఒకే చోటకు 600 మందికి పైగా సౌందర్య ఔత్సాహికులను తెచ్చింది. ఈ కార్యక్రమంలో భూమి పడ్నేకర్, నీనా గుప్తా, కృతి సనన్, సుషాంత్ దివ్ గికర్, ప్రైమ్ సభ్యులు, క్రియేట ర్లు, పారిశ్రామిక నాయకులు సహా బాలీవుడ్ దిగ్గజాలు కూడా పాల్గొ న్నారు. హైఫెన్, సెరావీ, లేనీజ్, టీఎఫ్ఐటీ, మిలాని, రియల్ టెక్నిక్స్, నాటికా ఫర్ హర్, లామెల్, ఇంకా ఎన్నో ప్రముఖ సౌందర్య బ్రాండ్స్‌కు చెందిన కొత్త విడుదలల ప్రత్యేకమైన ఫస్ట్ లుక్‌ను హాజరైన వారు అందుకున్నారు."అమేజాన్ బ్యూటీవెర్స్ 2025ని పరిచయం చేయడానికి మేము ఉల్లాసంగా ఉన్నాము, ప్రైమ్ సభ్యులు, అమేజాన్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ కోసం సౌందర్య ఆవిష్కరణను పునః ఊహించిన ప్రత్యేకమైనకార్యక్రమం," అని అమేజాన్ బ్యూటీ ఇండియా డైరెక్టర్ సిద్ధార్థ భగత్ అన్నారు.

'మేడ్ఇన్ఇండియా' సర్జికల్ రోబోట్ యాత్ర ప్రారంభం

విశాలాంధ్ర - విజయవాడ: ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఆధ్వర్యంలో గురుగ్రామ్‌లోని ప్రధాన కార్యాలయం నుంచి 'మేడ్ఇన్ఇండియా' ఎస్ఎస్ఐ మంత్రా సర్జికల్ రోబోట్ యాత్రను ప్రారంభించింది. ఈ యాత్రను హర్యానా ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి రావ్ నర్బీర్ సింగ్ ప్రారంభించారు. దేశంలో మొదటి సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ ఎస్ఎస్ఐ మంత్రాను ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ రూపొందించింది. దేశంలోనే మొట్టమొదటి మొబైల్ రోబోటిక్ శస్త్రచికిత్స శిక్షణ, ప్రదర్శన యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ వినూత్నమైన 'టెలిసర్జరీ - ఆన్ - వీల్స్' ఆధునిక సర్జికల్ సాంకేతికతను, శిక్షణా అవకాశాలను హాస్పిటల్స్, వైద్య నిపుణుల వద్దకు తీసుకెళ్తోంది. ఇది కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడమే కాకుండా, వైద్య నిపుణులకు శస్త్రచికిత్సలో నైపుణ్యం పెంచేందుకు ఒక అరుదైన అవకాశం. మొదటి దశ యాత్ర జైపూర్‌లో ఉన్న ఎస్ఎంఎస్ మెడికల్ కాలేజీలో ఆరంభమైంది. ఈ సందర్భంగా వైద్య నిపుణుల కోసం ప్రత్యక్ష ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ శిక్షణ సెషన్లు నిర్వహించారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పైపై హక్కులతో విపరీతమైన గొప్పలు ప్రచారం చేస్తూ ప్రజలను మోసపు మాటలతో గత పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని ఘోరమైన అప్పులు నెట్టేసిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డిలు ఆరోపించారు. కొత్తగూడ నియోజకవర్గ పర్యటనలు భాగంగా ఆదివారం వారితోపాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి లక్ష్మీదేవిపల్లి మండలం లోని సీతారాంపురం, చింతపెంటి గూడెంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాలకు శంకు స్థాపన చేసారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా హామీలు ఇచ్చిన మేరకు పథకాలన్నీ ప్రజల చెంత చేరుస్తున్నామని వివరించారు. డాంబిక ప్రచారాలకు పోకుండా చాలా సాదాసీది సీదాగా ప్రజల ప్రయోజనాలే ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన పథకాలన్ని అమలు చేస్తామని వారు ప్రజలకు భరోసా ఇచ్చారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సామాన్యమైన విషయం కాదన్నారు. దీనివల్ల లక్షలాది కుటుంబా లు బిల్లులు చెల్లించకుండా ఆర్థిక వెసులుబాటు పొందుతున్నట్లు చెప్పారు. రైతులకు సన్న వడ్లకు 500 బోనస్, రేషన్ కార్డుకు సన్నబియ్యం లాంటి సంక్షేమ కార్యక్రమాల దేశంలో ఎక్కడా లేవన్నారు. ప్రభుత్వానికి కష్టాలున్న రైతులందరీ ఖాతాల్లో ఒక ఎకరానికి రూ. 12 వేల చొప్పున వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్, సిపిఐ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర-చర్ల: జీపీఎఫ సరెండర్ లీవ్, గ్రాడ్యుటీ, కమిటేషన్ లాంటి పెండింగ్ బిల్లులను ఈ నెలలో చెల్లించాలని ప్రభుత్వాన్ని పీఆర్టీయు అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఎస్ఎస్. రవికుమార్, వీరభద్రం డిమాండ్ చేశారు. చర్ల మండల శాఖ అత్యవసర సమావే శాన్ని ఏర్పాటు చేసుకుని తక్షణ కర్తవ్యంగా ఉద్యోగ ఉపాధ్యాయుల రిటైరైన వారి మౌలిక సదుపాయల కల్పన సాధించే వరకు పోరాడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు వివరించడమే కాకుండా అమలయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అటువంటి ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన డీఏలను పెండింగ్ బిల్లులను రెండేళ్ల పైగా ఇవ్వకుండా ప్రభుత్వం మీనామేషాలు లెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలైన వాటిని చెల్లించకుండా రూ.180 కోట్లతొ మెడికల్ బిల్లులు చెల్లించి చేతులు దులుపుకున్నట్లు కనిపిస్తుందన్నారు. మిగతా బిల్లులు ఈ నెలలో చెల్లించాలని లేని పక్షంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర పీఆర్టీయు తరపున ఉద్యమానికి ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎస్ఎస్ఎస్. రవికుమార్, వీరభద్రం తోపాటు రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు సీహెచ్. వేణు, బీ. శ్రీనివాస్, గురుమూర్తి, రాజు, సాంబమూర్తి, దారయ్య, పలక నాగేశ్వరరావు, పున్నం రమణయ్య, వీరమోహన్, జ్యోతి, రాజేశ్వరి, సుభాషిణి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పినపాకలో ఎమ్మెల్యే పాయం విస్తృత పర్యటన

విశాలాంధ్ర - పినపాక : పినపాక మండలంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం విస్తృత పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా చెగర్శల, దుగినే పల్లి, కిష్టాపురం, రెడ్డిగూడెం, ఎల్చిరెడ్డిపల్లి, ఐలాపురం, ఏడూళ్ళ బయ్యారం గ్రామాల్లో నూతనంగా రూ 82 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిం చారు. ఐలాపురం గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులు తమ గ్రామానికి అంగన్వాడీ కేంద్రాన్ని మంజూరు చేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ డబుల్ బెడ్ రూమ్ కాలనీ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చొరవతో సీసీ రోడ్లు వేయించడంతో కృతజ్ఞతలు తెలిపారు. పినపాక అభివృద్ధికి కాంగ్రెస్ నాయకులు నిబద్ధతతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. తహశీల్దార్ గోపాల కృష్ణ, ఎంపీడీఓ సునీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాథం, నాయకులు ఉడుముల లక్ష్మిరెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, సూరెడ్డి తిరుపతి రెడ్డి, జి.శ్రీనివాస్ రెడ్డి, కొర్సా ఆనంద్, మాజీ సర్పంచులు తోలేం కళ్యాణి, ఈసం భవతి, మధు, ఏసు, కోర్స కృష్ణంరాజు, బందారు సాంబశివరావు, తోలేం అర్జున్, లింగయ్య, గుట్టయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - తొర్రూరు: బాబు జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి వేడుకలను ఆదివారం మండలంలోని పాలకేంద్రం సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహా నికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించి ఘనంగా జరుపుకున్నారు. దళితరత్న సోమారపు ఐలయ్య అధ్యక్షత జరిపారు. ఈ సందర్భంగా దళిత రత్న గుండాల నర్సయ్య, తొర్రూరు ఎంఈఓ మహంకాళి బుచ్చయ్యలు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో చురుకైన పాత్ర వహించి ఉద్యమంలో పాల్గొన్నారని, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంలో అనేక శాఖలను 30 సంవత్సరాలపైగా సేవలు చేసి ఈ దేశానికి ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు బత్తుల యాకయ్య, టీయుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధారావత్ కిషన్ నాయక్, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు రాయిశెట్టి వెంకన్న, పోసాని సంతోష్, రాయిశెట్టి ఉపేందర్, బంధు వెంకన్న, కుంట కుమ్ము బిక్షపతి, ఈదురు రమేష్, గుండాల రంజిత్, ప్రవీణ్ కుమార్, మంద యాకమల్లు, బచ్చలి వెంకన్న, బంధు వెంకన్న, దండే నర్సయ్య, బంధు రాములు, వడ్లకొండ ఐలయ్య, రాము పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కారేపల్లి : సింగరేణి మండలానికి ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ శంకుస్థాపన చేయనున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్ తెలిపారు. ఆదివారం ఆయన కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని రేలకాయలపల్లిలో ఉదయం 10:30కి రేలకాయలపల్లిలో ఉదయం 11:00కి జేత్రంతండాలో మధ్యాహ్నం12:00కి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.అలాగే గేట్ రేలకాయలపల్లి మాజీ సర్పంచ్ బానోతు సక్రామ్ కుటుంబాన్ని పరామర్శించనున్నారని తెలిపారు.కాగా మధ్యాహ్నం రెండు గంటలకి కారేపల్లి జిన్నింగ్ మిల్లులో అన్ని ప్రభుత్వ శాఖల మండల అధికారులతో సమావేశం నిర్వహించనున్నారని తదనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు కాంగ్రెస్ పార్టీ అన్ని గ్రామ శాఖల అధ్యక్షులతో పాటు ముఖ్య నాయకులతో సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే పాల్గొనే ఈ కార్యక్రమాలకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తాజామాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు.

అనువాద కవిత:

యుద్ధం

ఇద్దరూ నియమించబడ్డారు, సరిహద్దు ప్రాంతంలో
కొత్తగా
ఒకడు ఇటువైపు
మరొకడు సీమ రేఖకి అటువైపు
ఇద్దరూ కలిసి
సాయంత్రం మద్యం సేవించారు
ఖాళీ సీసాని పొదలో విసిరేసి
ఇద్దరూ ఒకరిని ఒకరు కాల్చుకున్నారు
ఒకడు తలకిందలా పడ్డాడు
సరిహద్దుకు ఇటువైపు
మరొకడు సరిహద్దుకి అటువైపు
దగ్గర పడియున్న సీసా మూతకి
ఏదైతే ఎప్పుడూ మూతే
మొదటిసారి అర్థం అయింది
యుద్ధాలు ఎలా ఆరంభమౌతాయో!

హిందీమూలం:
డా॥ కైలాశవాజపేయీ
తెలుగు అనువాదం:
పారనంది నిర్మల, సెల్: 9985103804

సాహితి

వర్తమానంలో తెలుగుభాష- అవగాహన

ఎస్. ఆర్. పృథ్వి
సెల్: 9989223245

తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ దెలుగొకండ
యెల్ల నృపులు గొలువ నెరుగవే బాసాడి?
దేశ భాషలందు దెలుగు లెస్స! - అని ఏనాడో
శ్రీకృష్ణదేవరాయలు అన్నప్పటికీ తెలుగునేల మీద ఇప్పుడు తెలుగు కంటే ప్రీతి పాత్రమయ్యాయి పర భాషలు.

తెలుగు భాష మీద అభిమానమున్న వారెందరు ఎన్ని విధాల ప్రాకులాడినా సరే, ప్రభుత్వ ప్రమేయం లేకపోతే తెలుగు భాషకు మనుగడ ఉండదు. ఇది నగ్న సత్యం.

కడలి అంచులు దాటి కదిలింది తెలుగు/ఎదల లోతులు దాటి ఎగిసింది తెలుగు-అనే పల్లవితో ప్రారంభించి-
ఇటు మలేషియా నుంచి అటు అమెరికా వరకు
పలు దిశల గొంతుకలు పలికింది తెలుగు
పెను విడాకులలోన, ఇనుప దారులలోన
పలుకు పలుకును జీవ మొలికింది తెలుగు- అని
డా॥సి.నారాయణరెడ్డి అన్నప్పటికీ, మన తెలుగునేల మీద పాలకుల గుర్తింపు కరవై వెలవెలబోవటం గమనిస్తున్న విషయం.

తెలుగు భాష మననం కోసం ఎన్నో ఉద్యమాలు నడిచాయి. ఎన్నో పత్రికలు నడిచాయి. తెలుగు భాషాభివృద్ధి కోసం అనేక మంది కవులు ఆరాటపడ్డారు. భాషా ప్రియులు నిలిచి పోరాడారు.
తేనె కన్న మధురంగా తెలుగు
ఆ తెలుగే మన కంటికి వెలుగు
మరవబోకు మరవబోకు తేట తెలుగు
కమ్మనైన అమ్మ భాష విశ్వానికి వెలుగు-తెలుగు భాష ఔన్నత్యం గురించి చెబుతూ, మన భాషను మరవద్దని విజ్ఞప్తి చేశారు డా॥ఎస్.కె.మద్దిలేటి.

జె.ఎస్.ఆర్.కె.శర్మ కర్నూలు నుంచి తెలుగు భాష వికాసం కోసం ఒక ఉద్యమాన్ని కూడా నడిపారు. దాని వయసు పాతికేళ్లు. ఎందుకంటే-
నాలుగు వేదాల పంట నా తెలుగు పాట
అడుగడుగునా సరిగమతో వడి వడిగా
పరుగిడు కన్నె గోదావరి నా తెలుగు పాట- అని తెలుగు భాష సంపదల సౌందర్యాన్నిచెప్పిన ఎం.గోపాలాచార్యులన్నట్లు, అటువంటి తెలుగు భాష ఏర్పడిన నిరాదరణను సహించలేకపోయారు.

ప్రపంచమిపుడు మనిషి గుప్పిట్లో అమరిపోయింది. జీవనాధారంలో భాగంగా పరభాషల నభ్యసించటం తప్పనిసరైంది. తప్పుకాదు. మనిషి, జాషువా అన్నట్లు విశ్వనరుడు. అవసరానికి ఎన్ని భాషలనైనా నేర్చుకోవాలి. కాని, మాతృభాషను మరువరాదు. మర్చిపోతే, కన్నతల్లిని మర్చిపోయినట్లే అని నా అభిప్రాయం. ఒక కవి అన్నది గుర్తు చేసుకోవాలిక్కడ.
మాతృభాషను కాదన్న మనుజుడరయ
బ్రతికి యుండియు వాడు జీవచ్ఛవంబె...
తెలుగు భాషాభివృద్ధి కోసం ఆంధ్రదేశంలో 2002 సం॥లో తెలుగుభాషా వికాసఉద్యమం ప్రారంభమైంది. జె.ఎస్.ఆర్.కె. శర్మ నేతృత్వంలో కర్నూలు కేంద్రంగా ఒక సంఘం పనిచేయటం ప్రారంభించింది. కడప, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, విశాఖపట్నం మొదలైన ప్రాంతాలలో పర్యటించి, అవగాహనా సదస్సులు నిర్వహించింది. 23 జిల్లా కేంద్రాలలో సమావేశాలు ఏర్పాటు చేసి, అనేక కార్యక్రమాలు రూపకల్పన చేసి, ఆచరణలో పెట్టింది. తెలుగు భాషోద్యమంలో భాగంగా జన చైతన్యం కోసం ఎల్.వివేకానంద సుమారు మూడు లక్షలు విరాళమివ్వగా కర్నూలు పట్టణంలో 28-8-2008 వ తేదీన తెలుగు భాషా రథయాత్ర

నిర్వహించారు. జె.ఎస్.ఆర్.కె.శర్మ నేతృత్వం వహించగా, అసంఖ్యాకంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయటం, ఇందులో భాగంగా అనేకమంది కవులను సత్కరించటం, వివిధపోటీల ద్వారా విద్యార్థినీ విద్యార్థులను ఉత్తేజపర్చటం విశేషం. తెలుగుభాష కున్న స్థానం అటువంటిది. మర్చిపోరాదు. అందుకే కప్పగంతుల జయరామయ్య-
"ముద్దులొలికెడి భాషరా
తేనెలూరెడి భాషరా
మన తెలుగు భాషను చూడరా!
అవని యందున భాషలన్నిట సాటిలేని భాషరా
అంతులేని పదాలసంపద ఆంధ్ర భాషకు సొత్తురా
అన్య భాషా పదాల నెన్నిటినో ఆదరించిన భాషరా
సకల భాషావేత్త లెందరో సన్నుతించిన భాషరా" అన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సహించలేక జె.ఎస్.ఆర్.కె.శర్మ న్యాయ పోరాటానికి కూడ వెనుకాడలేదు. 26-09-2003న తెలుగు భాషను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం మీద లోకాయుక్తలో కేసు ఫైలు చేసి, వాదనలు కూడా వినిపించారు. అయితే, ఇది తమ పరిధిలోకి రాదని 15-06-2004 న కేసు ముగించారు. అక్కడ కూడ-
"అన్య భాషల లేని అవధాన ప్రక్రియ
కు అనువైన దొక్కటే ఆంధ్ర భాష
పౌరాణికములైన పద్య నాటకముల
ప్రేక్షకావళి మెచ్చు మృధుల భాష" వంటి తెలుగుకు న్యాయం దక్కలేదు.

ఎందరో మహానుభావులు, ఎన్నో రీతుల తలమాణికమైన తెలుగుభాషను కీర్తించి, శిరసున ధరించారు. వేదుల సత్యనారాయణశాస్త్రి అంటారు.
తెలుగు నేలపైన తిరుగాడునపుడు
తెలుగుమాట నోట బలికినపుడు
తెలుగు వారి కథలు తలపోసినపుడు
పొంగిపోదు చూడు గర్వమున నేను.

తెలుగు భాషాభివృద్ధికి ఏమి చేయాలి? ఇంటి వద్ద ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలతో తెలుగులోనే మాట్లాడుతూ, వాళ్లూ తెలుగులోనే మాట్లాడే విధంగా తయారుచేయాలి. ఇక్కడే తప్పు జరుగుతాఉంది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఆంగ్లంలో మాట్లాడతా ఉంటే పొంగిపోతారు. ఎందుకంటే వర్తమాన సమాజంలో ప్రజలు-
"పరభాష వ్యామోహ పంపకంలో బడి
మాతృభాష మరచిన మందమతులు
తెలుగు తల్లికి బుట్టి, తెలుగు రాదని
టముకు వేయుచు బల్కుడంబరపరులు
తెలుగు సంస్కృతి యనిన, తెలుగుభాష యనిన
మొరటుగా భావించు మూర్ఖాపరుల
ఉద్యోగ ప్రాప్తికై ఉపయోగపడదంచు
తెలుగును నిరసించు కలుషమతుల"- అని పి.వెంకటేశ్వరప్రసాద్ వారి మనసులో బాధని వెళ్లగక్కారు.

అందుకే పిల్లలకి తెలుగు పుస్తకాలు బాగా చదవటం అలవాటు చేయాలి. తెలుగు పద్యాలు, పాటలు నేర్పడం ద్వారా, వారిలో తెలుగు భాషపై మక్కువ పెంచాలి. బంధుమిత్రులతో మాట్లాడు నప్పుడు, వారికి ఉత్తరాలు రాయునప్పుడు తెలుగును వాడేటట్లుగా బాధ్యత తీసుకోవాలి. ఇప్పుడు ఉత్తరాలు రాసే పాత్ర తగ్గిపోయింది. సెల్‌ఫోను మెసేజ్‌లు పెరిగిపోయాయి. అందువలన ఆ మెసేజ్‌లు అయినా తప్పనిసరిగా తెలుగులో పంపటం అలవాటు చేసుకుని తెలుగు భాష ఉన్నతికి తోడ్పడాలి.

మనం దుకాణ సముదాయాల్లోకి వెళ్లినప్పుడు, దుకాణం పేర్లు ఆంగ్ల భాషలోనే దర్శనమిస్తాయి ఎక్కువ సందర్భాలలో. ఆ పేర్లను ఖచ్చితంగా తెలుగులో ఉండేటట్లు ఆజ్ఞలు జారీచేయాలి. ఆ తర్వాత మరే భాషనైనా వినియోగించుకోవచ్చు. అలాగే పరిశ్రమల విషయంలో కూడా. ఇది ప్రభుత్వం చేయవలసిన పని.

మనం తెలుగువాళ్లమే అయినా సంతకం తెలుగులో చెయ్యం. తమిళులు, ముస్లింలు, గుజరాతీలు ఇలా ఎవరిభాషలో వారు సంతకాలు చేస్తుంటే తెలుగువారు మాత్రం ఆంగ్లంలో సంతకాలు చేస్తారు. ఈ విధానంలో మార్పురావాలంటే తెలుగు భాష అంటే, మన మాతృభాషని, దాని మీద ప్రేమ జనించాలి.

ప్రభుత్వ కార్యాలయాల్లో అందరూ మాట్లాడేది తెలుగే అయినా, కార్యకలాపాలన్నీ ఆంగ్ల భాషలోనే జరుగుతాయి. దీనిని మార్చాలంటే పాలకులు నడుంకట్టాలి. వారికి ముందు మాతృభాషమీద ప్రేమ పుట్టాలి. ఇక విద్యారంగంలో ప్రాథమికవిద్య, ఉన్నతవిద్య తెలుగు మాధ్యమంలో కొనసాగాలి. ఎందువల్లనంటే ఒక కవి అన్నట్లు-
"లలిత రసభావ మంజూష తెలుగుభాష
కవిత మృధుశబ్ద సుశిరీష తెలుగుభాష
దీప్త గంభీర ఘనఘోష తెలుగుభాష
దివ్య దరహాస వాగ్భూష తెలుగుభాష"
తెలుగు భాషా ప్రియులు ఆశించిన విధంగా తెలుగుభాషకి మంచి రోజులు రావాలంటే పాలకులు తెలుగ భాషా ప్రియులై ఉండాలి. లేకపోతే కలలు దుస్సాధ్యమే.

నిశీథిలో...

పగటికి వీడ్కోలు చెప్పి
పక్షులు...
తరువుల ఒడిలోకి
తిరిగొచ్చాయి

వెన్నెల దూకగానే
నదిపై...
వెండిపొర పరచుకుంది

మిణుకు మిణుకుమంటూ
నింగిలో తారలు
తమ ఉనికిని
చాటుకుంటున్నాయి

అలలు నెమ్మదించగానే
చెట్లు... తమను తాము
నింపాదిగా చూసుకుంటున్నాయి

ఊరంతా నిద్రపోతున్నా
దీపమెట్టుకుని ఎదురుచూస్తోంది
తనయుడి కోసం తల్లి మనస్సు

చిరుగాలి చెంతకొచ్చి
గట్టుమీద గడ్డిపోచల్ని
రేయంతా ఊయలూపింది

వెన్నెల మైకంలో
పురివిప్పిన కలువలు
చీకటికి పరిమళమద్దుతున్నాయి

ప్రేమ జంట కూర్చోగానే
పాటందుకుంది పడవ
పరవశిస్తూ...పండువెన్నెల
వారితో పాటే
ఒడ్డుకు పయనమయింది

పసుపు రంగు పులుముకుని
తూరుపు తలుపు తెరిచింది
లేత భానుడు నిద్ర లేవగానే
నదిలో దూకాడు

అలల గోల మళ్లీ మొదలైంది
చీకటి ముసుగు తొలగించి
ప్రకృతి కళ్ళు తెరిచింది

పొద్దు పొడవగనే
విన్యాసాలు చేస్తూ...
నింగిలోకి దూసుకెళ్లింది
పక్షుల వరుస

ఎ. నాగాంజనేయులు
9959017179

'వెలుగుల వెనుక'

పుస్తకావిష్కరణ సభకు ఆహ్వానం

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం, నవచేతన పబ్లిషింగ్‌హౌస్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కథా రచయిత, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ కథాసంపుటి 'వెలుగుల వెనుక' ఆవిష్కరణ సభ 08-07-2025 మంగళవారం సాయంత్రం 5గంటలకు హైదరాబాద్, రవీంద్రభారతి (మొదటి అంతస్తు) లో జరుగును. సభకు తెలంగాణ అరసం అధ్యక్షులు డా॥పల్లేరు వీరాస్వామి అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథి, పుస్తకావిష్కర్తగా తెలుగు యూనివర్శిటీ పూర్వ ఉపాధ్యక్షులు, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ వ్యవహరిస్తారు. విశిష్ట అతిథులుగా పూర్వ శాసన సభ్యులు చాడా వెంకటరెడ్డి, ప్రముఖ రచయిత, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డా॥ ఏటుకూరి ప్రసాద్, గౌరవ అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ రచయిత, తెలంగాణ బిసి కమిషన్ పూర్వ ఛైర్మన్ బి.ఎస్.రాములు, నవచేతన పబ్లిషింగ్‌హౌస్ మేనేజర్ ఎన్.మధుకర్ పాల్గొంటారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కథా, నవలా రచయిత డా॥ కాలువ మల్లయ్య, ప్రముఖ కథా రచయిత, విమర్శకులు ఆడెపు లక్ష్మీపతి విచ్చేస్తారు. ప్రముఖ కథా రచయిత, విమర్శకులు కె.పి.అశోక్‌కుమార్ గ్రంథ పరిచయం చేస్తారు. ఈ సభకు తెలంగాణ అరసం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.వి.ఎల్ స్వాగతంతో, రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ అరసం ఏలేశ్వరం వెంకటేశం సభా నిర్వాహకులుగా వ్యవహరిస్తారు.

అందరికీ ఇదే మా ఆహ్వానం

డా॥ రాపోలు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం
ఫోన్: 9441779688

మావూరి మంచివాడి ఆత్మకథ

గ్రంథ సమీక్ష

మధురాంతకం నరేంద్ర,
98662 43659

మా దామలచెరువు హైస్కూల్లో చదువుకున్న సి ఆర్ నాయుడు అనే చేరెడ్డి రామచంద్రయ్యనాయుడు రాసుకున్న ఆత్మకథ కొండమెట్లు ఇటీవల ప్రచురితమైంది. ఇది మీ అందరికీ మామూలు విషయంగా కనిపించవచ్చు కానీ నాకుమాత్రం ఏ దినపత్రికలోనైనా పతాక శీర్షికలో రావలసిన ప్రముఖమైన విషయం. ఊరులన్నిటిలోన ఏ ఊరు మేలు అనే గేయం నేను చదువుకున్న రెండవ తరగతి పాఠ్య పుస్తకంలో ఉండేది. అదే బాణీలో హైస్కూలు లన్నిటిలోన ఏ హైస్కూలు మేలు అని అడిగితే ఏ మాత్రం తడుముకోకుండా నిర్ద్వందంగా మా దామలచెరువు హైస్కూలు మేలు అని చెప్తాను. ఈ మాట రూపాయకు నూరు పైసలు అన్నంత నిర్దుష్టమైన సత్యం అని ప్రకటించడానికి సందేహించను. నాకంటే ఏడెనిమిది సంవత్సరాలు ముందుగా 1965 ప్రాంతంలో మా హైస్కూల్ నుంచి ఎస్.ఎస్.ఎల్.సి. పాసైన సి ఆర్ నాయుడుని చంగల్‌రాయుడనే ఉపాధ్యాయుడు సివిల్స్ రాసి పెద్ద ఆఫీసర్ కమ్మని ప్రోత్సహించి ఆయనకొక టార్గెట్ పెట్టేసాడని సిఆర్‌నాయుడు ఇంతవరకు గుర్తుపెట్టుకున్నాడు. గణితము సైన్సులతోపాటు ఇంగ్లీషు కూడా బోధించిన చెంగల్‌రాయుడు అందరు విద్యార్థులనూ అదే రకంగా ప్రేమించారని చాలా మందికి తెలుసు. పదవ తరగతి పాస్ అవుతూనే పాలిటెక్నిక్ కాలేజీలో ఫార్మసీలో నన్ను చేర్పించినప్పుడు మా నాన్నగారిని వ్యతిరేకించి నిలదీసిన వాడాయన. తరువాత నేను వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషులో లెక్చరర్‌గా చేరాక కానీ ఆయన మనసు శాంతించలేదు. ఆ రోజుల్లో మా దామలచెరువు హైస్కూల్లోని ఉపాధ్యాయులందరూ చెంగల్ రాయుడులా మరపురాని మహోన్నతమైన వ్యక్తులు.

రమణయ్యగారి పల్లె అనే మా పల్లెటూరు దామల చెరువు నుంచి మూడుమైళ్ల దూరంలో ఉంది. సరైన రవాణా సౌకర్యాలు లేని మా చిన్నతనంలో చాలాసార్లు ఆ మూడు మైళ్ల దూరాన్ని నడిచేవాళ్లం. అప్పుడు దామలచెరువు నుంచి బయలుదేరాక చల్లారి వారి మామిడితోటను దాటాక బస్సుబాటని వదిలి పొలాలగట్ల పైనుంచి మొగరాలకు అడ్డదారిలో పోయేవాళ్లం. ఆ అడ్డదారి సరిగ్గా కొమ్మేపల్లి అని చిన్న పల్లెటూరి మీదుగా వెళ్లేది. అలా కొమ్మేపల్లి అనే ఆ చిన్న పల్లెటూరిని చిన్నతనంలో చాలాసార్లు చూసినప్పుడు ఆ ఊర్లో పుట్టిన కుర్రాడొకడు పెద్ద ఐపీఎస్ ఆఫీసర్ అవుతాడని, అతను ఇలా తన ఆత్మ కథను కూడా రాసుకుంటాడని నేను ఆ రోజుల్లో ఊహించనైనా లేదు.

1850 ప్రాంతంలో ఇప్పుడు తమిళనాడులో ఉన్న చెంజి కోట దగ్గరి వెంకటాపురం అనే గ్రామం నుంచి మా ముత్తాత పాతిక ఇండ్ల రమణయ్యగారి పల్లెలోని గ్రామీణుల కోరిక మేరకు తెలుగులో పాఠాలు చెప్పడం కోసం వచ్చి స్థిరపడిపోయాడు. 1900 ప్రాంతంలో ఆయన మూడవ కొడుకును అక్కడికి రెండుమైళ్ల దూరంలో ఉన్న కృష్ణాపురం అనే కుగ్రామానికి పాఠాలు చెప్పడం కోసం ఆ గ్రామస్తులు ఆహ్వానించి తీసుకెళ్లి పోయారు. అలా కృష్ణాపురం చేరిన మా చిన్న తాతకు ఆ ఊర్లోఉన్న ఒక రైతు తమ పెద్దపూరింటిలో సగభాగం గోడ గట్టించి నివాసానికి శాశ్వతంగా ఇచ్చేశాడు. దాదాపు ఒకటిన్నర శతాబ్దం క్రితం విద్యా వ్యవస్థ ఎలా ఉండేదో అప్పుడు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా నిజమైన విద్యకోసం సాదాసీదా గ్రామీణులనబడే వాళ్లు ఎంతగా కృషి చేశారో తలచుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. తన తల్లి చనిపోయిన తరువాత తన అక్కగారి ఇంటికి చేరిన సి ఆర్ నాయుడు సగభాగం ఉపాధ్యాయుడికి ఇవ్వగా మిగిలిన సగభాగం ఇంటిలోకి చేరుకున్నాడు. రెండో సగభాగంలో ఉండిన మా చిన్నాన్న సుబ్బనాగరత్నం ఆ ఊర్లో చాలామంది పిల్లలు పైచదువులు చదవటానికి చాలా దోహదం చేశారని ఇప్పటికీ చెప్పుకుంటూ ఉంటారు. తాను పదవ తరగతి చదువుతుండగా తన తల్లి చనిపోయిందని ఆ తరువాతే

తాను కృష్ణాపురం చేరానని సి ఆర్ నాయుడు చెప్తారు. బహుశా అందుకేనేమో ఆయన మా చిన్నాన్న గురించి పెద్దగా ఏమీ చెప్పలేదు. అయితే ఆ ఇంట్లో పెరిగిన ఐదుమంది పిల్లలు తరువాతి కాలంలో డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ప్రొఫెసర్లుగా, ఐపీఎస్ ఆఫీసర్లుగా ఎదగడం వెనుక ఆ కుటుంబానికి తరతరాలుగా విద్య పైన ఉన్న మక్కువే కారణమని తెలుసుకోవడం పెద్ద కష్టమైన పని కాదు.

సి ఆర్ నాయుడు జీవితం నడిపించినట్లు నడిచారు. వీలు కుదిరినప్పుడు అవసరమైనప్పుడు తనకి ఇష్టం వచ్చినట్టుగా జీవితాన్ని మలచుకున్నారు. పెద్దలను, ఉపాధ్యాయులను తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను గౌరవిస్తూనే ఉన్నారు. అవకాశాలు దొరికినప్పుడల్లా కొత్త మార్గాల్లోకి నడవడానికి సందేహించలేదు.

యూనివర్సిటీలో చదువుకుంటున్నప్పుడు యూత్ కాంగ్రెస్ కార్యకర్తగా ఉన్న తాను కావాలనుకుని ఉంటే రాజకీయాల్లోకి కూడా వెళ్లగలిగే ఉండేవారు. అయితే కష్టపడిచదివి ఐపీఎస్ అయ్యాడు. పెద్ద పోలీస్ ఆఫీసర్‌గా పనిచేసినప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి దేశ ఉపరాష్ట్రపతి వంటి వారు ఇంటికొచ్చి ఫోంచేసి వెళ్ళేటంతటి దగ్గరిమిత్రులైనా ఆ పరిచయాలనేమి ఉపయోగించుకోకుండా రాజకీయాలకు దూరంగానే ఉండిపోయాడు. పోలీసు అధికారిగా తన బాధ్యతలని చిత్తశుద్ధిగా నిర్వహించాడు. ఇంకా సర్వీసులో ఉండగానే దాదాపు రెండు సంవత్సరాలు ముందుగా స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని వ్యాపారంలోకి దిగాడు.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో వ్యవసాయక కుటుంబంలో పుట్టిన సీఆర్ నాయుడుకి వ్యవసాయం కంటే వ్యాపారం లాభదాయకమని చిన్నతనంలోనే తెలిసి రావడం గుర్తించవలసిన విషయం. కాలేజీ చదువుతున్న రోజుల్లోనే ఆయన మా ఊరి మునసబుకొడుకుతో కలిసి వేరుశెనక్కాయల వ్యాపారంచేసి కొంత నష్టపోయాడు. అయినా వ్యాపారంపైన ఉన్న ఇష్టం మాత్రం అలాగే ఉండిపోయింది. వ్యాపారరంగంలోనూ, షేర్ మార్కెట్ లోను సి ఆర్ నాయుడు అనుభవాలు ఆయన పాఠకులకు ఇచ్చే సలహాలు ఆసక్తికరంగా ఉన్నాయి. అయితే ఆ రెండురంగాలలో ఆయన సాధించినవిజయాలు జానపద గాథల్లోని కథానాయకుడు సాధించే ఊహాతీతమైన విజయాల్లా ఆశ్చర్యచకితుల్నిజేస్తాయి. ఆయన తన ఆత్మ కథకు కొండమెట్లు అని పేరు పెట్టుకున్నాడు. కొంత కష్టపడితే గమ్యాన్ని చేరుకోగలిగే తిరుమల శేషాద్రి కొండలు ఉన్న మాజిల్లాలోనే పైకెళ్లడం పెద్ద సాహసంతో కూడినపనిగా మారే పులిగుండుకొండ కూడా ఉంది.

స్టాక్ మార్కెట్ అనేది లాటరీ లాంటిది కాదని దాని వెనక చాలా శాస్త్రీయమైన అధ్యయనం ఉంటుందని ఆయన అంటాడు. దాన్ని ఆయన అధ్యయనం చేసినతీరు విశ్లేషించిన పద్ధతి అందులో ఆయన విజయాలు పొందిన విశేషాలు ఆధునిక ప్రపంచాన్నంతా ఒక తాటి పైన నడిపిస్తున్న ధనస్వామ్యపు బాహుముఖాలనూ, పార్శ్వాలనూ పరిచయంచేస్తాయి. వ్యాపార లావాదేవీలకు సమాంతరంగా సామాజిక సేవ కోసం ఆయన చేసిన కృషి చాలా ముచ్చట గొలుపుతుంది.

చిత్రమేమిటంటే కృష్ణాపురంలో మా చిన్నాన్న వాళ్ల పక్క ఇంటిలో చదువుకొని పైకొచ్చిన ఐదు మందిలో సీఆర్ నాయుడు ఒక్కరితోనే నాకు ఇంతవరకు ముఖపరిచయమైనా లేదు. అయితే ఈ పుస్తకం చదివాక ఆయన నాకు బాగా పరిచయమున్న వ్యక్తిగా అనిపిస్తున్నాడు. మా ఊరి దగ్గరి పల్లెలలో పుట్టి తాను ఎన్నుకున్న రంగాలలో గొప్ప విజయాలను సాధించిన విజేతలలో ఆయన ఒకడు. ఆయన ఆత్మ కథను చదివినప్పుడు నాకు తెలిసిన ప్రపంచంలోనే నాకు తెలియని వింత ప్రపంచాలు చాలా ఉన్నాయని తెలిసి వచ్చింది. కొమ్మేపల్లి అని చిన్న పల్లెటూరు నుంచి చదువు, ఉద్యోగం, వ్యాపారం, స్టాక్‌మార్కెట్ల మీదుగా హైదరాబాదు జూబ్లీహిల్స్ రోడ్‌నెంబర్3 లోని ఇప్పటి తన నివాసం వరకు తాను చేసిన ప్రయాణాలను, ప్రస్థానాలను, ప్రయోజకత్వాలను, ఆయన యీ పుస్తకంలో సంతృప్తిగా నెమరేసుకున్నాడు. వీలైనంత పారదర్శకంగా నసగుసులుపోకుండా స్పష్టంగా చెబుతూనే చాలా విషయాలను గీతల మధ్య ఆయన నర్మగర్భంగా దాచి పెట్టిన తీరు పాఠకులకు సవాలుగా ఉంటుంది. తాను కూడా అందరిలా సామాన్య మానవుడిననే వినయమూ, ఏది చెప్పాలో, ఏది చెప్పకూడదో, ఏది ఎంతవరకు చెప్పాలో తెలుసుకోగలిగే సంయమనమూ ఉన్నప్పుడే ఎవరి ఆత్మకథ అయినా ఇలా అభినందనీయంగా తయారవుతుంది. ఆయన తన బాల్యం గురించీ తన కుటుంబం గురించీ తన స్నేహితుల గురించీ మరి కాస్త వివరంగా రాసి ఉంటే బాగుంటుందని కూడా అనిపిస్తుంది. ఇంకొన్ని వివరాలు అదనంగా ఉంటే బాగుంటుందనుకున్నప్పుడే ఆపేయగలడం గూడా ఒక మంచి లక్షణమే. అందువల్ల ఇటీవల వచ్చిన ఆత్మకథలలో సి ఆర్ నాయుడు కొండమెట్లుకు ఒక ప్రత్యేకమైనస్థానం ఉంటుంది.

ఇతర రాష్ట్రాలకూ
భాషా ఉద్యమం వ్యాప్తి
రాక్రేల కలయికపై స్టాలిన్

చెన్నై: జాతీయ విద్యా విధానంలో త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా, హిందీ భాష రుద్దడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తున్నారు. హిందీ భాషకు వ్యతిరేకంగా ఠాక్రే సోదరులు ఒక్కటయ్యారు. ఈ కలయికను స్టాలిన్ స్వాగతించారు. తమిళనాడులో ప్రస్తుతం ఉన్న ద్విభాషా-తమిళం, ఇంగ్లీష్ అమలులో ఉంది. అయితే, బీజేపీ ప్రభుత్వం హిందీని తమిళనాడుపై విధిస్తోందని స్టాలిన్ ఆరోపిస్తున్నారు. ఠాక్రేల ర్యాలీ తర్వాత ఎక్స్‌లో స్టాలిన్ కీలక పోస్ట్ పెట్టారు. భాషా హక్కుల కోసం పోరాటం రాష్ట్ర సరిహద్దులు దాటిందని, మహారాష్ట్రలో ఊపు కనిపిస్తోందని ఆయన అన్నారు. 'హిందీ విధించడాన్ని ఓడించడానికి డీఎంకే, తమిళనాడు ప్రజలు తరతరాలుగా సాగుతున్న భాషా హక్కుల పోరాటం ఇప్పుడు రాష్ట్ర సరిహద్దులు దాటింది. మహారాష్ట్రలో నిరసన తుపానులా ఎగిసిపడుతుంది' అని స్టాలిన్ అన్నారు. 'తమిళనాడు పాఠశాలల్లో హిందీని మూడవ భాషగా బోధిస్తేనే నిధులు కేటాయిస్తామని పేర్కొంటూ చట్టవిరుద్ధంగా, అరాచకంగా వ్యవహరించే బీజేపీ... అధికారంలో ఉన్న మహారాష్ట్రలో ప్రజల తిరుగుబాటు భయంతో రెండవసారి వెనక్కి తగ్గవలసి వచ్చింది' అని స్టాలిన్ అన్నారు.

దలైలామాకు మోదీ, మార్కో శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా శాంతికి రూపమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దలైలామా జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'పవిత్ర ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదినం సందర్భంగా 140 కోట్ల మందితో కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ప్రేమ, కరుణ, ఓర్పు, నైతిక క్రమశిక్షణకు ఆయన బలమైన చిహ్నం. మతాలకు అతీతంగా ఆయనిచ్చే సందేశం ప్రజలను ప్రభావితం చేస్తుంది. ఆయన దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'దలైలామాకు 90వ జన్మదిన శుభాకాంక్షలు. సమైక్యత, శాంతి, కరుణ సందేశాలతో ప్రపంచంలో ఆయన స్ఫూర్తిని నింపుతూనే ఉండాలి' అని తన సందేశంలో ఆకాంక్షించారు. మరోవైపు 90వ పుట్టిన రోజు సందర్భంగా దలైలామా మాట్లాడుతూ 'మానవతా విలువలు, మత శాంతి ప్రచారం చేయడానికి నేను కట్టుబడి ఉంటాను. టిబెట్ సంస్కృతి ప్రపంచానికి మానసిక ప్రశాంతత, కరుణ అందిస్తుంది' అని పేర్కొన్నారు.

గ్యాంగ్ లీడర్ భార్యతో అక్రమ సంబంధం

నాగపూర్: గ్యాంగ్ లీడర్ భార్యతో వివాహేతర సంబంధం ఓ వ్యక్తి కొంపముంచింది. ఆమె మరణం అతడి చావుకు వచ్చింది. 40 మంది ఉన్న ఆ గ్యాంగ్ అతడి కోసం వెంటాడుతోంది. ప్రాణ భయంతో ఆ వ్యక్తి అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఇప్ప గ్యాంగ్‌కు పోలీసు రికార్డుల్లో మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌గా పేరుంది. అర్షద్ టోపి అనే వ్యక్తి ఆ గ్యాంగులో సభ్యుడిగా ఉన్నాడు. అతడు ఏకంగా ఆ గ్యాంగ్ లీడర్ భార్యతో అక్రమసంబంధం పెట్టుకున్నాడు. ఇద్దరూ తరచుగా ఏకాంతంగా కలుస్తూ ఉండేవారు. బయట తిరుగుతూ ఉండేవారు. గురువారం ఇద్దరూ బైకు మీద బయటకు వెళ్లారు. వారు ప్రయాణిస్తున్న బైకు ప్రమాదానికి గురైంది. గ్యాంగ్ లీడర్ భార్య తీవ్రంగా గాయపడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. అర్షద్ మాత్రం చిన్న చిన్న గాయాలతో బయటపడ్డాడు. భార్య చనిపోవటంతో ఇప్ప గ్యాంగ్ లీడర్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. తన భార్యకు, అర్షద్‌కు సంబంధం ఉందని తెలియటంతో ఆగ్రహంతో ఊగిపోయాడు. తన భార్య చావుకు అర్షద్ కారణమని గ్యాంగ్ లీడర్ భావించాడు. అతడ్ని చంపి పగ తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు. గ్యాంగ్ మొత్తం అర్షద్‌కు వ్యతిరేకంగా మారింది. అతడ్ని వెతికిపట్టుకుని చంపాలని నిర్ణయించుకున్నారు. ఇప్ప గ్యాంగ్ అర్షద్ కోసం గాలిస్తోంది. తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియటంతో అర్షద్ డీసీపీ ఆఫీస్‌కు వెళ్లాడు. పోలీసులు అతడి వాంగ్మూలం నమోదు చేశారు. పోలీసులను కలిసిన తర్వాత అర్షద్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇప్ప గ్యాంగ్ అతడిని పట్టుకోవడానికి వేటాడుతోంది.

నేర రాజధాని బీహార్
నితీశ్ సర్కార్‌పై రాహుల్ ధ్వజం

పట్నా: బీజేపీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కలిసి బీహార్‌ను 'భారతదేశ నేర రాజధాని' గా మార్చారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆదివారం విమర్శించారు. ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాను పట్నాలోని తన నివాసం వెలుపల కాల్చి చంపిన ఘటన ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసిందని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు... ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాదని, రాష్ట్రాన్ని కాపాడటానికి కూడా అని ఆయన నొక్కి చెప్పారు. హాజీపూర్‌లో తన కొడుకును దుండగులు కాల్చి చంపిన ఏడు సంవత్సరాల తర్వాత ఖేమ్కాను ఆయన నివాసం వెలుపల బైక్‌పై వచ్చిన దుండగుడు కాల్చి చంపాడని పోలీసులు శనివారం తెలిపారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి 11.40 గంటల ప్రాంతంలో గాంధీ మైదాన్ ప్రాంతంలోని ఖేమ్కా ఇంటి గేటు సమీపంలో తన కారు దిగబోతుండగా జరిగిందని వివరించారు. 'ఎక్స్' లో హిందీలో చేసిన పోస్ట్‌లో రాహుల్ గాంధీ... పట్నాలో వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కాపై కాల్పులు జరపడం... బీజేపీ, నితీశ్ కుమార్ కలిసి బీహార్‌ను 'భారతదేశ రాజధాని' గా మార్చారని మరోసారి రుజువు చేసిందని పేర్కొన్నారు. 'నేడు బీహార్ దోపిడీ, తుపాకీ కాల్పులు, హత్యల నీడలో జీవిస్తోంది. నేరాలు ఇక్కడ కొత్త సాధారణ స్థితికి చేరుకున్నాయి. ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'బీహార్ సోదరసోదరీమణులారా, ఈ అన్యాయాన్ని ఇక ఎంతమాత్రం సహించలేము. మీ పిల్లలను రక్షించలేని ప్రభుత్వం మీ భవిష్యత్‌కు కూడా బాధ్యత వహించదు' అని తెలిపారు. ప్రతి హత్య, ప్రతి దోపిడీ, ప్రతి బుల్లెట్ మార్పు కోసం కేకలు వేస్తోందని అన్నారు. అక్టోబరు-నవంబరులో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ సంఘటన జరిగింది.

కుప్పకూలిన శాంతిభద్రతలు: తేజస్వి

పట్నా: ఎన్డీఏ పాలనలో బీహార్‌లో శాంతిభద్రతలు కుప్పకూలాయని ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఆదివారం విమర్శించారు. రెండు దశాబ్దాలలో రాష్ట్రం '65 వేల హత్యలు' చూసిందని అన్నారు. బీహార్‌కు చెందిన వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా హత్య తర్వాత ప్రతిపక్ష నాయకుడు ఈ వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లో కుప్పకూలిన శాంతిభద్రతలు, విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిపై రాష్ట్రంలో ఎవరికీ కోపం తెప్పించకపోతే, ఆ వ్యక్తిలో న్యాయ భావం, కరుణ చచ్చిపోయాయని మనం చెప్పాలి. కులం, మతం పేరుతో ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల మనోభావాలను విస్మరించడం బీహార్‌కు, రాష్ట్ర ప్రజలకు వినాశకరమైనది. ఎన్డీఏ పాలనలో ఇప్పటివరకు 65 వేల హత్యలు జరిగాయి. స్పృహలో లేని ముఖ్యమంత్రి అలాంటి ఏదైనా సంఘటనపై ప్రకటన చేయడానికి ధైర్యం చేస్తారా?' అని తేజస్వి ఆదివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఇది చాలా ఎక్కువ. పట్నాలోని అత్యంత సురక్షితమైన ప్రాంతంలో అధికారంలో ఉన్నవారిచే రక్షించబడిన, పెంచబడిన నేరస్థులు నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్తను దారుణంగా హత్య చేశారని ఆయన తెలిపారు. 'ఏడు సంవత్సరాల క్రితం ఖేమ్కా కుమారుడు గుంజన్‌ను కూడా అధికారంలో ఉన్నవారిచే రక్షించబడిన నేరస్థులు కాల్చి చంపారు. కానీ హంతకులు ఇప్పటికీ పరారీలో ఉన్నారు. బీహార్ పోలీసుల శిక్ష రేటు ఎంత? గుంజన్‌ను హత్య చేసిన వారు బెయిల్‌పై స్వేచ్ఛగా ఎలా తిరుగుతున్నారు?' అని తేజస్వి ప్రశ్నించారు. డీకే పన్ను పథకం కింద పోలీసు అధికారులను బదిలీ చేస్తే... పోలీసులు నేరస్థులను పట్టుకోవడానికి బదులుగా మద్యం కోసం వెతకడంలో బిజీగా ఉంటారు. తెలివిలేని ముఖ్యమంత్రికి ఎవరిపైనా ఆందోళన లేదా? అని ఆయన నిలదీశారు.

తోకముడిచిన బీజేపీ
బీహార్‌లో ఎస్ఐఆర్‌పై ఖర్గే

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ద్వారా బీహార్ ప్రజల ఓటర్ల హక్కులను హరించడానికి బీజేపీ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం విమర్శించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి చేసినందుకు కాషాయ పార్టీకి రాష్ట్ర ఓటర్లు గుణపాఠం నేర్పుతారని అన్నారు. బీహార్ ఓటర్లు ఎస్ఐఆర్ కింద ఒక ఫారమ్ మాత్రమే నింపాలని కోరుతూ ఎన్నికల సంఘం (ఈసీ) జారీ చేసిన కొత్త ప్రకటనను ఆయన ఉదహరించారు. 'ప్రజలు ఆందోళన చేయడంతో బీజేపీ వెనక్కి తగ్గింది' అని అన్నారు. 'ఎన్నికల సంఘం మద్దతుతో బీహార్‌లోని కోట్లాది మంది ప్రజల ఓటు హక్కులను హరించడానికి బీజేపీ రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇప్పుడు ఆ పార్టీనే ఉచ్చులో పడేసినట్లు కనిపిస్తోంది' అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. మొదటి రోజు నుంచే కాంగ్రెస్... ఎస్ఐఆర్‌కి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ వచ్చిందన్నారు. 'ఎన్నికల తర్వాత ఓటు వేసే వారిని తమ పత్రాలు చూపించమని ఎందుకు అడుగుతారు? పేదలు, బలహీనులు, అణగారిన వర్గాలు, దళితులు, అణచివేతకు గురైన, వెనుకబడిన వర్గాల ప్రజల ఓటు హక్కును బలవంతంగా లాక్కోవడం బీజేపీ-ఆర్ఎస్ఎస్ కుట్ర' అని ఆయన మండిపడ్డారు. ఎస్ఐఆర్ కారణంగా దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రజలు నష్టపోతారని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. 'ఓటరు జాబితాను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రజలపై కాదు. ఈసీపై ఉంది' అని అన్నారు. 'ప్రతిపక్షం, ప్రజలు, పౌర సమాజం నుంచి ఒత్తిడి పెరిగినప్పుడు ఇప్పుడు ఒక ఫారమ్ మాత్రమే నింపాల్సిన అవసరం ఉందని, పత్రాలను చూపించాల్సిన అవసరం లేదంటూ ఎన్నికల సంఘం ఈ రోజు ఈ ప్రకటనలను హడావిడిగా ప్రచురించింది' అని పేర్కొన్నారు. 'ఇది ప్రజలను తప్పుదారి పట్టించడానికి, గందరగోళానికి గురిచేయడానికి బీజేపీ వ్యూహంలో భాగం. నిజం ఏమిటంటే, ప్రజాస్వామ్యాన్ని ఎలాగైనా అణిచివేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. కానీ ప్రజా వ్యతిరేకత ఎదురైనప్పుడు అది తెలివిగా ఒక అడుగు వెనక్కి తీసుకుంటుంది' అని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. బీహార్ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు అని పేర్కొన్న ఖర్గే... రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై బీజేపీ చేసిన దాడికి రాష్ట్ర ప్రజలు తప్పకుండా ప్రతిస్పందిస్తారని అన్నారు.

ఎఫ్-35 యుద్ధ విమానానికి మరమ్మతులు

తిరువనంతపురం: కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన బ్రిటన్ రాయల్ నేవీకి చెందిన యుద్ధ విమానం ఎఫ్-35బీకి మరమ్మతు చేసేందుకు, విమానాన్ని ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. యుద్ధవిమానం మరమ్మతు పనులు చేసేందుకు బ్రిటన్ నుంచి 24 మంది ఏవియేషన్ ఇంజినీర్ల బృందం ప్రత్యేక పరికరాలతో ఆదివారం కేరళ చేరుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరమ్మతులు చేయడానికి దానిని హ్యాంగర్‌కు తరలించారు. రానున్న రోజుల్లో దీన్ని సీ-17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానంలో తరలించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన అన్ని మరమ్మతులు, భద్రతా తనిఖీల తర్వాత విమానం తిరిగి సేవలు ప్రారంభిస్తుందని బ్రిటిష్ హైకమిషన్ అధికారి తెలిపారు. తద్వారా ఇతర విమానాల షెడ్యూల్ నిర్వహణకు ఎటువంటి అంతరాయం ఉండదని పేర్కొన్నారు. కేరళ విమానాశ్రయంలో ఉన్న ఫైటర్ జెట్ ఎఫ్-35 బీ విమానానికి భారీ భద్రత కల్పించామని, సాయుధ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది కాపలాగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. గత నెల ఇండో-యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బీ విమానంలో సమస్య తలెత్తింది. దీంతో జూన్ 14వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత తిరువనంతపురం విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరతతో దీన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, ఫైటర్ జెట్‌లో ఇంజినీరింగ్ సమస్య ఉన్నట్లు ఆ తర్వాత బ్రిటన్ అధికారులు వెల్లడించారు. దీనికి మరమ్మతులు చేయడానికి అదే రోజు రాత్రి ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో నిపుణులు వచ్చారు. మరమ్మతులు నిర్వహించినా విమానం మొరాయించడంతో అప్పటి నుంచి దాదాపు ఈ ఫైటర్‌జెట్ ఎయిర్‌పోర్టులోనే ఉంది.

మరాఠీ కాదు... అధికార కాంక్ష
ఠాక్రే సోదరులపై ఫడ్నవీస్ ఎదురుదాడి

ముంబై: తమను బాలాసాహెబ్ ఠాక్రే కూడా కలపలేకపోయారని, ఫడ్నవీస్ వల్ల తాము కలిశామంటూ రాజ్ ఠాక్రే చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. 'సోదరులను తిరిగి కలిపిన ఘనత నాకు ఇచ్చినందుకు రాజ్ ఠాక్రేకు ధన్యవాదాలు. నాకు బాలాసాహెబ్ ఠాక్రే ఆశీస్సులు లభించి ఉండాలి. ఇది విజయ్ ర్యాలీ అని చెబుతున్నారు. అయితే, అది 'రుదాలి' ప్రసంగంగా మారింది' అని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుండి హిందీని మూడవ భాషగా తప్పనిసరి చేసిన రెండు వివాదాస్పద తీర్మానాలను మహారాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నందుకు వేడుకగా ఠాక్రే సోదరులు ముంబైలో ర్యాలీ నిర్వహించారు. 25 ఏళ్లుగా ముంబై నగరంలో పాలనలో ఉన్నప్పటికీ శివసేన అభివృద్ధిని పట్టించుకోలేదని, కానీ మోదీ నాయకత్వంలో బీజేపీ ముంబైని మార్చిందని ఫడ్నవీస్ అన్నారు. ఠాక్రేల విజయ్ ర్యాలీని విమర్శిస్తూ మరాఠీ గురించి ఒక్క ముక్క మాట్లాడకుండా, వారి ప్రభుత్వం ఎలా కూలిపోయిందో, మళ్లీ ఎలా అధికారంలోకి రావాలని మాత్రమే ఠాక్రేలు ప్రసంగాల్లో పేర్కొన్నారని, వారి బాధ మరాఠీ గురించి కాదని, అధికారం గురించి అని అన్నారు. ముంబైలో మరాఠీ, మరాఠీయేతర ప్రజలంతా బీజేపీతోనే ఉన్నారని, తాము మరాఠీలము, హిందుత్వవాదులమని, హిందువులుగా గర్విస్తున్నామని ఫడ్నవీస్ అన్నారు.

ఠాక్రే సోదరులపై బీజేపీ నేత అక్కసు

ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే కలయికపై బీజేపీ నేత, రాష్ట్ర మంత్రి నితేశ్ రాణే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హిందువులను బలహీనపరిచే కుట్రగా దీనిని అభివర్ణించారు. వీరిద్దరు నిర్వహించిన ర్యాలీ హిందూ వ్యతిరేకమని, ప్రజల్ని హిందువులు, మరాఠీలుగా విభజించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఠాక్రే సోదరుల ర్యాలీని జిహాదీ, హిందూ వ్యతిరేక ర్యాలీగా అభివర్ణించారు. ఇది సమాజాన్ని విభజిస్తుందని, రాష్ట్రాన్ని బలహీనపరుస్తుందని చెప్పారు. 'మేము హిందువులం, మరాఠీలుగా ఉండటం మాకు గర్వకారణం. జిహాదీలు మన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నించే విధానం. ఈ వ్యక్తులు కూడా ఇదే చేస్తున్నారు. నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) లేదా సిమికి వీరు భిన్నంగా లేరు' అని వ్యాఖ్యానించారు. ఠాక్రేల ర్యాలీతో హిందువులు ఎక్కువగా నష్టపోతారు, తర్వాత నల్ బజార్(ముస్లిం ఆధిపత్య ప్రాంతం)లో స్వీట్ల పంపిణీ జరుగుతుందన్నారు.

సామాజిక సమానత్వంలో
భారత్ భేష్
కేంద్ర సామాజిక సంక్షేమ శాఖ ప్రకటన

న్యూఢిల్లీ: అత్యంత సామాజిక సమానత్వం ఉన్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలు సహా 167 దేశాల కంటే మెరుగైన స్థానం సంపాదించింది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'జీని ఇండెక్స్' నివేదికను ఉటంకిస్తూ కేంద్ర సామాజిక, సంక్షేమ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. పేదరికాన్ని తగ్గించే చర్యలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోనే ఈ సమానత్వం సాధ్యమైందని చెప్పుకొచ్చింది. మొత్తం 171 దేశాలతో కూడిన జీని ఇండెక్స్‌లో భారత్ 25.5 పాయింట్లతో స్లోవాక్ రిపబ్లిక్ (24.1), స్లొవేనియా(24.3), బెలారస్ (24.4) తర్వాత నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపింది. భారత స్కోరు 2011లో 28.8 పాయింట్లుగా ఉండగా... 2022 నాటికి 25.5 పాయింట్లకు మెరుగుపడిందని వివరించింది. జీని ఇండెక్స్‌లో బ్రిటన్ (32.4), చైనా (35.7), అమెరికా (41.8) మనకన్నా వెనుకబడ్డాయని పేర్కొంది. 'భారత ఆర్థిక పురోగతి పౌరుల మధ్య సమానంగా ఉందని ఈ నివేదిక వెల్లడించింది. పేదరికం తగ్గింపు, విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాల అమలు, జన్‌ధన్ యోజన, ఆధార్ వంటివాటితో నేరుగా సంక్షేమ పథకాల నగదు బదిలీ, ఆయుష్మాన్ భారత్‌తో వైద్య సదుపాయం వంటివి దీనికి కారణం. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో 2011 నుంచి 2023 మధ్య 17.1 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరికం 16.2 శాతం నుంచి 2.3 శాతానికి తగ్గింది' అని సామాజిక సంక్షేమశాఖ ప్రకటనలో పేర్కొంది.

హత్యాయత్నం కేసులో ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్

అహ్మదాబాద్: హత్యాయత్నం కేసులో గుజరాత్ ఆప్ ఎమ్మెల్యేను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ పంచాయతీ కార్యకర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆప్ ఎమ్మెల్యే చైతర్ వాసవను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. శనివారం రాత్రి వాసవ నియోజకవర్గం దేడియాపాడులో జరిగిన సమావేశంలో ఘర్షణ నెలకొంది. స్థానిక సమన్వయ కమిటీ 'ఆప్నో తాలూకో వైబ్రంట్ తాలూకో (ఏటీవీటీ)లో నియామకం కోసం తన నామినీని నిర్లక్ష్యం చేశారంటూ ఎమ్మెల్యే ఆగ్రహానికి గురయ్యారు. పంచాయతీ మహిళా ప్రెసిడెంట్‌ను దుర్భాషలాడటంతో పాటు పంచాయతీ అధ్యక్షుడిపై దాడికి దిగినట్లు ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యాలయ ఆస్తులను కూడా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అయితే ముందుగా తనపై మొబైల్ ఫోన్ విసిరారని, తలకి గాయాలయ్యాయని, అనంతరం గాజు గ్లాస్‌తో కొట్టేందుకు యత్నించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే అరెస్ట్‌ను ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ ఖండించారు. విశావదర్ ఉప ఎన్నికలో ఆప్ ఇటీవల విజయం సాధించడంతో ఆప్ ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకున్నారని మండిపడ్డారు. ఇది బీజేపీ రాజకీయ ప్రతీకార దాడిగా అభివర్ణించారు. దాడులతో ఆప్‌ను భయపెట్టాలని భావిస్తే అది తప్పని అన్నారు.

హిమాచల్‌లో ఆగని వర్ష బీభత్సం
75కు చేరిన మృతులు
అనేక జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ
సహాయక చర్యల్లో ఐటీబీపీ బృందాలు



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి ప్రకోపానికి మండి జిల్లాలో మృతుల సంఖ్య 75కు చేరడం తీవ్ర విషాదాన్ని నింపింది. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వానల కారణంగా కొండచరియలు విరిగిపడుతుండగా, మెరుపు వరదలతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ విపత్తు కారణంగా రాష్ట్రంలో 240కి పైగా రహదారులు పూర్తిగా మూతపడ్డాయి. వాటిలో అత్యధికంగా 176 రోడ్లు ఒక్క మండి జిల్లాలోనే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. భారీ వర్షాలతో సహాయక చర్యలకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఒక్క రోజులోనే 115 నుంచి 204 మిల్లీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా, వాతావరణ శాఖ రానున్న 24 గంటలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. కంగ్రా, సిర్మౌర్, మండి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. చంబా, కంగ్రా, శిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో మెరుపు వరదలు సంభవించవచ్చని హెచ్చరించింది. మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసి, బలహీనమైన కట్టడాల్లో నివసించవద్దని ప్రజలను కోరింది. ప్రస్తుతం ఐటీబీపీ దళాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) సహకారం కూడా తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ప్రభుత్వానికి సూచించారు.

గోదావరి పరవళ్లు

మహారాష్ట్రలోనూ ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నాసిక్ పట్టణంలో గోదారమ్మ పరవళ్లు తొక్కుతోంది. వర్షాల కారణంగా వరద నీరు చేరడంతో ఉప్పొంగి పరుగులు తీస్తోంది. పట్టణంలోని పంచవటి లో రామాలయం పాక్షికంగా మునిగిపోయింది.

సీఏ ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ పరీక్షల ఫలితాల విడుదల

న్యూఢిల్లీ: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సీఏ ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. మేలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలు, మెరిట్ లిస్టులను ఆదివారం విడుదల చేసింది. విద్యార్థులు https://icai.nic.in వెబ్‌సైట్‌లో తమ రోల్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ తదితర వివరాలను నమోదు చేయడం ద్వారా స్కోరు కార్డులతో పాటు మెరిట్ కార్డులను పొందవచ్చని తెలిపింది. సీఏ ఫౌండేషన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 551 కేంద్రాల్లో 82,662 మంది హాజరయ్యారు. వీరిలో కేవలం 12,472 మంది (15.09శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. బ్రిందా అగర్వాల్ (ఘజియాబాద్) జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, యజ్ఞేష్ రాజేశ్ నర్కర్ (ముంబై), శార్దూల్ శేఖర్ విచారే (థాణే) రెండు, మూడు ర్యాంకులు సాధించారు. సీఏ ఇంటర్‌లో గ్రూప్-1 పరీక్షలకు 97,034 మంది హాజరు కాగా... కేవలం 14,232 మంది మాత్రమే (14.67శాతం) ఉత్తీర్ణులయ్యారు. గ్రూప్-2లో 72,069 మంది హాజరు కాగా... 15,502 మంది (21.51శాతం), రెండు గ్రూపులనూ 38,029మంది రాయగా, 5,028మంది (13.22శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. సీఏ ఇంటర్ పరీక్షల్లో దిశ ఆశీష్ (ముంబై) తొలి ర్యాంకు సాధించగా, దేవిదాన్ యశ్ సందీప్ (ఔరంగాబాద్) రెండో ర్యాంకు, యామిష్ జైన్ (జైపూర్), నిలరు దంగీ (ఉదయ్‌పూర్) మూడో ర్యాంకు సాధించారు. సీఏ ఫైనల్‌లో గ్రూప్ -1 పరీక్షలకు 66,943 మంది హాజరు కాగా... కేవలం 14,979 మంది (22.38 శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గ్రూప్-2 పరీక్షల్లో 46,173 మంది హాజరుకాగా... కేవలం 12,204 మంది (26.43 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రెండు గ్రూపుల్లో 29,286 మంది పరీక్షలు రాయగా... 5,490 మంది (18.75శాతం) మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. సీఏ ఫైనల్ పరీక్షల్లో రాజన్ కబ్రా(ముంబై) జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించగా, నిషిత బోత్రా (కోల్‌కతా), మానవ్ రాకేశ్ షా (ముంబై) మూడో ర్యాంకు సాధించారు.

ఐదు నెలలు... 922 మంది
ఇది రైల్వే ప్రయాణ మృతుల సంఖ్య

ముంబై: మహారాష్ట్రలోని ముంబైలో రైలు ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. రద్దీతో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ముంబైలో కేవలం 5 నెలల్లో 922 మంది ప్రయాణికులు తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోయారు. వీటిలో 210 మంది నడుస్తున్న రైళ్ల నుంచి కింద పడి మరణించారు. ఈ ఏడాది జనవరి 1- మే 31 మధ్య ముంబైలో స్థానిక రైలు ప్రయాణికులు ఇలా ప్రాణాలు కోల్పోయారని లెక్కలు చెబుతున్నాయి. సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చిన సమాధానం ప్రకారం ముంబై రైల్వే పోలీస్ కమిషనరేట్ ఇచ్చిన తాజా లెక్కలు ఇవి. నగర జీవనాధారంగా చెప్పబడే ముంబై సబర్బన్ రైల్వే నెట్‌వర్క్‌లో కొనసాగుతున్న భద్రతా సంక్షోభానికి భయంకరమైన గుర్తులుగా వీటిని చెప్పుకోవాల్సిన పరిస్థితి. ప్రతీ రోజూ ఉండే రైల్వే ప్రయాణికుల రద్దీ, బోగీల సంఖ్య తక్కువగా ఉండటం, ప్లాట్‌ఫామ్స్ మీద భద్రతా చర్యలు లేకపోవడం వల్ల లక్షలాది మంది రోజువారీ ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదు... ఇది ప్రజారోగ్యం, ఇంకా భద్రతా అత్యవసర పరిస్థితిని సూచిస్తోందని నగరానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త అజయ్ బోస్ అంటున్నారు. నివారించగల కారణాలతో మనం దాదాపు ప్రతిరోజూ ప్రాణాలు కోల్పోతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకు మహువా మొయిత్రా

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ... స్పెషల్ ఓటర్ల జాబితా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)నిర్వహించాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు సవాల్ చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని వివిధ నిబంధనలు ఉల్లంఘిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతోందని... గత నెల 24న ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని ఆమె పిటిషన్‌లో అభ్యర్థించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. బీహార్లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ సవరణ జరుగుతోందని... ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1), 21, 325, 328, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 ఎన్నికల నమోదు నియమాలు, 1960లోని నిబంధనలను ఉల్లంఘించినట్లేనన్నారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయకపోతే దేశంలో పెద్ద సంఖ్యలో అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బీహార్‌తో పాటు బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయడాన్ని నిలిపివేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని మహువా సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తొలిసారిగా ఓటర్ల జాబితాలో ఇప్పటికే పేర్లు ఉన్నా... గతంలో అనేకసార్లు ఓటు వేసిన ఓటర్లంతా తమ అర్హతను నిరూపించుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంటుందని... ఇది ఆర్టికల్ 326కి విరుద్ధమని పేర్కొన్నారు. మొయిత్రా తరపున న్యాయవాది నేహా రతి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉండగా... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సవాల్ చేస్తూ ఏడీఆర్ సైతం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక ప్రోత్సాహం

రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోగస్ ఓట్ల ఏరివేతలో భాగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. ఈ ప్రక్రియను వేగవంతంగా సాగేందుకు కృషిచేస్తున్న ఎన్నికల సిబ్బంది ఒక్కొక్కరికి రూ. ఆరువేలు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : స్వర్గీయ భారత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ బిజెఆర్ నగర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ముఖ్యంగా సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్, రంగమ్మ, బ్రహ్మయ్య, మోయిన్, ఉపేందర్, ఇబ్రహీం, ఇస్మాయిల్, రమేష్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర నాల్గవ మహాసభలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : భారత గడ్డపై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ, తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఆగస్టు నెలలో మేడ్చల్ జిల్లా జరుగుతున్న సందర్భంగా మహాసభలు విజయవంతం చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ కోరారు. ఆదివారం న్యూ నాగోల్‌లోని సిపిఐ ప్రజాసంఘాల కార్యాలయం డాంగే భవన్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడి, అనేక పోరాటాలు చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల మండల సహాయ కార్యదర్శి ఎం.డి బషీర్, ఎస్.రాములు, రాసమల్ల రాజేందర్, ఉడతల మల్లేష్ గౌడ్, బి.సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగజీవన్‌రామ్‌కు నివాళుర్పించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ నియోజకవర్గం బుద్వేల్ అరంగర్ చౌరస్తాలో ఉన్న బాబు జగజీవన్‌రామ్ విగ్రహానికి వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి బాబు జగ్జీవన్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన మహానుభావుడు బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్‌రావు ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్య నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

యాంటీ రాబీస్ వాక్సినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్ రూరల్: ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని వెటర్నరీ ఆసుపత్రి నందు నిర్వహించిన పెంపుడు కుక్కలకు యాంటీ రాబీస్ వాక్సినేషన్ కార్యక్రమాన్ని సంస్థ వారి సహకారంతో ఏరియా వెటర్నరీ ఆసుపత్రి షాద్ నగర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా కుక్కల ద్వారా మనుషులకు సోకే రేబిస్ వ్యాధి రాకుండా నివారించడానికి పెంపుడు కుక్కలను ముందస్తు టీకాలు వేయించుకోవాలని అన్నారు ఎందుకంటే రేబిస్ వ్యాధికి చికిత్స లేదు వ్యాక్సిన్ ఒక్కటే మార్గం అని అన్నారు. ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, పశు వైద్యులు డాక్టర్ ముక్కంటి రాజ్, డాక్టర్ సునీత, డాక్టర్ వెంకటేష్ రెడ్డి, సహాయ పశువైద్య సిబ్బంది, లావణ్య, శ్రీధర్, చంద్రశేఖర్, నజీర్, జగదీశ్వర్, దినేష్, సలీం, సొసైటీ ప్రతినిధులు రాజేందర్, నాయకులు మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, కృష్ణా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అందే మోహన్, ముబారక్, మురళీమోహన్, ఖదీర్, మహబూబ్, దిలీప్, అశోక్ పాల్గొన్నారు.

ప్రజలకు మొహరం పానకం పంపిణీ

విశాలాంధ్ర - అమనగల్లు : మొహర్రం పర్వదినం సందర్భంగా పీర్ల పండుగ ముగింపు నేపథ్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలోని బస్టాండ్ చౌరస్తాలో ముస్లింలు ప్రజలకు పానకం అమనగల్లు ముస్లిం నవ్ జవాన్ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇస్లాం ధర్మ సంస్థాపన కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇమామ్ హుస్సేన్, వారి అనుచరులు చేసిన మహోన్నత త్యాగాలకు ప్రతీక మొహర్రం పండుగని వివరించారు. ఇమామ్ హుస్సేన్ ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

ఇందిరమ్మ ప్రభుత్వంతో చెంచుల సొంతింటి కల సాకారం

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాజంలో అత్యంత వెనుకబడిన చెంచులు దశాబ్దాల పాటు సొంత ఇండ్లకు నోచుకోలేదని వారి సొంతింటి కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం సాకారం చేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మున్ననూర్, ఏటూరు నాగారం నాలుగు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ)ల పరిధిలోని 21 నియోజకవర్గాలలో సచ్యురేషన్ పద్దతిలో 13,266 చెంచు కుటుంబాలను ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పలు సందర్భాలలో సూచించడం జరిగిందని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అనేక సందర్భాలలో గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి, ముఖ్యంగా వారి నివాస గృహాల నిర్మాణంపై అనేక సూచనలు చేశారని గవర్నర్, ముఖ్యమంత్రి సూచనలు సలహాల మేరకు గిరిజన ప్రాంతాల్లో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో భాగంగా సోమవారం అచ్చంపేట నియోజకవర్గం మున్ననూర్‌లో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణతో కలిసి చెంచులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను స్వయంగా తానే అందజేస్తున్నట్లు తెలిపారు. అడవులను నమ్ముకొని జీవించే గిరిజనులలో చెంచులు ఒక జాతి అని, వీరు అడవుల్లో వేటాడటం, అటవీ ఫలసాయం సేకరించి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారని, చిన్నచిన్న గుడిసెలు తప్ప వీరికి పక్కా ఇల్లు ఎలా ఉంటుందో ఊహకు అందని విషయమని, అలా అని ఆ అడవి ప్రాంతాల్ని వదలి వారు బతక లేరు. అందుకే వీరు జీవించే ప్రదేశంలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన కూడా చేయలేదన్నారు. ఉట్నూరు ఐటిడిఎ పరిధిలో (10, 836 ఇండ్లు) మంచిర్యాల 157, నిర్మల్ 153, ఆసిఫాబాద్ 3371, బోథ్ 163, ఖానాపూర్ 2257, సిర్పూర్ 227, అదిలాబాద్ 2848, బెల్లంపల్లి 223, భద్రాచలం ఐటిడిఎ పరిధిలో అశ్వరావుపేట 274, మున్ననూర్ చెంచు స్పెషల్ ప్రాజెక్ట్‌లో (2156) అచ్చంపేట్ 785, మహబూబ్‌నగర్ 245, పరిగి 63, తాండూర్ 174, కొల్లాపూర్ 105, కల్వకుర్తి 120, వికారాబాద్ 63, దేవరకద్ర 64, నాగార్జునసాగర్ 17, మొత్తంగా 13,266 ఇండ్లను చెంచులకు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లును మంజూరు చేస్తున్నామని, అయితే ఐటిడిఎ పరిధిలోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్ల చొప్పున 8750 ఇండ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. గిరిజన ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిర్మాణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

శ్రీకాశీ విశ్వనాథ దేవాలయ కమిటీ నూతన చైర్మన్‌గా రమేష్

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేరేడ్మెట్ ప్రధాన రోడ్డులో ఉన్న చారిత్రాత్మకమైన శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ దేవాలయ నూతన చైర్మన్‌గా జిఎం రమేష్ నియమితులయ్యారు. ఆయనతోపాటు ఆలయ కమిటీ వైస్ చైర్మన్‌గా ఏ.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సామల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా గంగాధరి కృష్ణ, కార్యదర్శిగా కొత్తింటి అశోక్, సహాయ కార్యదర్శిగా బీవీ మనోజ్, సీనియర్ అడ్వైజర్ గా ఎల్.విజయ్ కుమార్ లను నియమిస్తూ ఆలయ కమిటీ తీర్మానం చేసింది. ఆదివారం ఆలయంలో అధ్యక్షులు బి.ఎం.రాజారామ్ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో సభ్యుల హర్షధ్వనుల మధ్య ఏడుగురు కొత్తవారిని నియమించారు. అనంతరం నూతనంగా నియమితులైన వారి చేత ఆలయ అధ్యక్షులు బి.ఎం. రాజారామ్, ప్రధాన కార్యదర్శి గంగాధరి రాజులు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఆలయ కమిటీ చైర్మన్ గా నియమితులైన జి యం రమేష్ మాట్లాడుతూ ఆలయం ఏర్పడి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా రాజగోపురం నిర్మాణం పూర్తి చేసి పీఠాధిపతులతో ఘనంగా ప్రారంభోత్సవం చేశామన్నారు. అయితే ఆలయంలో (ఆధునీకరణ) పనులు రెన్యూవేషన్ చేసి ఆలయంలో ఉన్న 18 స్తంభాలకు (పిల్లర్లు) కు దేశంలో ఉన్న అష్టాదశ శక్తి పీఠంలకు సంబంధించిన అమ్మ వార్ల విగ్రహాలను ఇక్కడి స్తంభాలపై ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని శ్రావణ మాసంలో చేపడుతామని అన్నారు. అలాగే శ్రీ శివపార్వతుల కళ్యాణమండపాన్ని కూడా పెద్ద ఎత్తున నిర్మించాలని సంకల్పించినట్లు జిఎం రమేష్ పేర్కొన్నారు. కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అడ్వైజర్ ఈ గణేష్ కార్యనిర్వాహణ కార్యదర్శులు బి.సువర్ణ లక్ష్మి, జే.శివకుమార్, ఏ.సంతోష్ కుమార్, కోశాధికారి వేదవ్రత్, సభ్యులు ఎన్.సుమంత్, ఆలయ కమిటీ మేనేజర్ నవీన్ కుమార్ వేద పండితులు పాల్గొన్నారు.

రతన్ రంజన్‌పై ఏసీపీకి యువజన కాంగ్రెస్ ఫిర్యాదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పై తప్పుడు దురుద్దేశ పూరిత సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, భారతీయ మహిళను లక్ష్యంగా చేసుకొని వారిని కించపరిచే విధంగా ప్రసారం చేసిన రతన్ రంజన్ ఇతరులపై తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆధ్వర్యంలో అబిడ్స్ పోలీస్ ఏసిపి ప్రవీణ్ కుమార్ కు రతన్ రంజన్ పై ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది. బీహార్ రాష్ట్ర ఎన్నికల్లో భాగంగా గ్రామీణ ప్రాంతంలో నివసించే మహిళలు ఎదుర్కొంటున్న సున్నితమైన సామాజిక సమస్యను దృష్టిలో ఉంచుకొని బీహార్ పేద మహిళలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం కోసం, సానిటరీ ప్యాడ్లను పంపిణీ చేసే కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ సూపర్ శక్తి షీ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యా రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దీపక్ ప్రజ్ఞ, ఖైరతాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు హరిధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నరాల నిహార్, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, యరమల రాం రెడ్డి, సురేష్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు విజంఢ్ల సాయి, ఖైరతాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన శేరిలింగంపల్లి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేర్లింగంపల్లి నియోజకవర్గంలో సిపిఐ 4వ మహాసభ. ఇజ్జత్ నగర్ లో జరిగిన సందర్భంగా సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని తెలిపారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలని ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వని పక్షంలో పేదలకు కనీసం 50 గజాల ఇంటి జాగానైనా ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు 500 కి సిలిండర్ మహిళలకు 2500 లాంటి సంక్షేమ పథకాలు పేద ప్రజల ఉండడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు శేర్లింగంపల్లి నియోజకవర్గంలో సిపిఐ పార్టీ నూతన మండల కార్యదర్శులను సహాయ కార్యదర్శిలను రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రకటించారు నూతనంగా శేర్లింగంపల్లి సిపిఐ మండల కార్యదర్శి టి రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సహాయ కార్యదర్శిగా కె చందు యాదవ్ 15 మంది కార్యవర్గ సభ్యులతో 31 మంది కౌన్సిల్ సభ్యులతో సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలియజేశారు నూతనంగా ఎన్నికైన కార్యదర్శి టి రామకృష్ణ సహాయ కార్యదర్శి కే చందు యాదవ్ రాబోయే కాలంలో పేద ప్రజల పక్షాన నిలబడి పేద ప్రజలకు అందవలసిన సంక్షేమ పథకాలను అందే విధంగా పోరాటాలు నిర్వహించాలని వారికి దిశ నిర్దేశం చేశారు.

మొహరం సందర్భంగా

మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక ప్రార్థనలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలిలో మొహరం పండుగ సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్, వెంకటేష్ యాదవ్, బి.కే.శ్రీనివాస్, గుండా నిరంజన్, హమీద్, మజార్, వెంకటేష్, దశరథ్ రెడ్డి, శివాజీ, నర్సింగ్ రావు, చందు, ఫారుక్, పిట్ల నాగరాజు, షకీల్, అజయ్, పాండురంగ చారి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో ఘనంగా అమ్మవారి ఘటం ఊరేగింపు ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆషాఢమాసం అమ్మవారి బోనాల జాతరను పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే అమ్మవారి ఘటం ఊరేగింపు ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. గౌతమ్ నగర్ డివిజన్‌లోని దుర్గ భవాని అమ్మవారి ఆలయంలో ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటానికి ప్రజల దర్శనార్థం 15 రోజుల పాటు పలు కాలనీలో ఊరేగిస్తూ ఉంటారు. అమ్మవారి ఘటాన్ని దర్శించుకుని భక్తులు తన్మయత్వం పొందుతుంటారు. 15 రోజుల అనంతరం అమ్మవారి ఘటం మల్కాజిగిరిలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయానికి చేరుతుండంతో అమ్మవారి బోనాలు జాతర ప్రారంభం అవుతుంది. దీనిలో భాగంగా మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, మంజుల జగదీష్ గౌడ్ దంపతులు ఘటానికి హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మండల రాధాకృష్ణ, జీడి నారాయణ గౌడ్, గుడిదెన మహేందర్ గౌడ్, నాగేష్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, జీడి బాలచందర్ గౌడ్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్యం అనంతరం దేశ ఉప ప్రధానిగా, వివిధ శాఖల కేంద్ర మంత్రిగా భారత దేశ అభివృద్ధిలో కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం రావడానికి బాబు జగ్జీవన్ రామ్ కృషి ఎనలేనిదని, అంటరానితనం నిర్మూలన కోసం తన జీవితాన్ని ధారబోసిన గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలను, సమాజానికి చేసిన అమూల్యమైనవి కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొలిటీషియన్స్ జేఏసీ అధ్యక్షుడిగా నాగుల శ్రీనివాస్

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : దేశ స్థాయిలో ఏర్పడుతున్న పొలిటీషియన్స్ జేఏసీ తెలంగాణ విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ కన్వీనర్ నాగుల శ్రీనివాస్ యాదవ్ ను వివిధ సంఘాల ప్రతినిధులు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నాగుల శ్రీనివాస్ యాదవ్‌ను నాయకులు గొల్లపల్లి దయానంద్‌రావు, పద్మారావు, తుమ్మల ప్రసూల్ రాంరెడ్డి, బోయ గోపి, మల్లం రమేష్, చీమల జగదీశ్ తదితరులు గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన వివిధ సంఘాల ప్రతినిధుల రాష్ట్ర స్థాయి సమావేశంలో నాగుల శ్రీనివాస్ మాట్లాడారు. 2014 వరకు తెలంగాణ రాష్ట్రం కోసం పాటుపడ్డ ఉద్యమకారులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటూ రాజకీయ క్షేత్రంలో అవకాశాలు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు, అన్న అంశాలతో ఏర్పడ్డ తెలంగాణలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులకు, వివిధ సంఘాల ప్రతినిధులకు, తెలంగాణ రావడం కోసం ధన, ప్రాణ త్యాగం చేసిన వారికి 2014 నుండి 2023 వరకు ఎటువంటి లాభం జరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అండగా ఉంటూ అప్పటి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్రలు వహించిన వివిధ వ్యవస్థల నాయకులు అందరు కలిసి తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ క్షేత్రంలో, ప్రభుత్వంలో, మనకు కూడా పాత్ర ఉండాలన్న ఉద్దేశంతో దేశ స్థాయిలో ఏర్పడుతున్న పొలిటీషియన్స్ జేఏసీ తెలంగాణ విభాగాన్ని తయారు చేసుకున్నామని అన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా సభ్యులను నియమిస్తామని అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తెలిపారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో జాతీయ వనమహోత్సవం

విశాలాంధ్ర - కాప్రా : మానవాళి మనుగడకు మొక్కల జీవనాదారమని, ప్రతి ఒక్కరూ తమ విధిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణ చుసుకోవాలని నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ పాఠశాల చైర్మన్ కె.నవనీతరావు సూచించారు. జాతీయ వనమహోత్సవాన్ని పురస్కరించుకుని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ ఆవరణమంతా ఆకుపచ్చరంగుతో అలంకరించారు. పిల్లలు, ఉపాధ్యాయులు ఆకుపచ్చ వస్త్రధారణతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలతో కూడిన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కె. నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కె.నవీన్ కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం నవనీతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ చూసుకోవాలన్నారు. దీనివల్ల మన భవిష్యత్తు పురోభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం స్వర్ణ అక్కినేని మాట్లాడుతూ పర్యావరణం ఆరోగ్యానికి మార్గం వేస్తుందనీ, చెట్లు పెంచి పరిరక్షించడం వల్ల ఆక్సిజన్ శాతం పెరిగి, కాలుష్యం తగ్గుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. చెట్లు పెంచడం మన అందరి బాధ్యత అని, దాని కోసం మనమందరం కృషి చేసి మన పర్యావరణాన్ని పచ్చదనంతో నింపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్య, గాన, నాటకాలతో పర్యావరణ పరిరక్షణా సందేశాన్ని అందించారు. విద్యార్థులు పర్యావరణ సంరక్షణ కోసం చెట్లను కాపాడాలని రాఘవేంద్ర నగర్ పరిసరాల్లో ర్యాలీని నిర్వహించారు.

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కొలను పూజలు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ శ్రీ సీతారమచంద్రస్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామివారికి చందన అలంకారం, లక్ష తులసి అర్చన ఎంతో విశేషంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాసరెడ్డి పాల్గొని స్వామివారికి విశేషమైనటువంటి పూజలు నిర్వహించారు. కొలను శ్రీనివాసరెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు బదరి నారాయణాచార్యులు, తిరుమల ఆగమ పండితుడు అయినట్టు వంటి శేష సాయి, వెంకట రమణచార్యులు వేద ఆశీర్వచనలు అందించారు.

పెద్ద చెరువు, మినీ ట్యాంక్ బండ్‌ను పరిశీలించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ పెద్ద చెరువు గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో రూ.14.5 కోట్ల భారీ నిధులతో పీర్జాదిగూడ పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసి, కార్పొరేషన్ పరిధిలోని ప్రజల అవసరాలకు తగిన విధంగా అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. అప్పట్లో పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం అక్కడ కనిపించేది. అయితే ప్రస్తుతం చెరువు పరిస్థితి ఎలా ఉందో స్వయంగా తెలుసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, ఇతర నాయకులు కలిసి చెరువును ఆదివారం పరిశీలించారు. డ్రైనేజీ నీరు చెరువులో కలవడాన్ని నిరోధించే చర్యలు పారిశుధ్య నిర్వహణ లోపాలు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లేఏరియా వంటి వసతుల ఏర్పాటు అవసరం ఉందని ప్రజల నుండి తెలుసుకోవడం జరిగింది. ఇవన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే చర్యలు తీసుకునేలా కమీషనర్ త్రిశేశ్వర్‌రావు, మున్సిపల్ అధికారులను కోరారు. నాయకులు జావీద్ ఖాన్, మల్లం వెంకటేష్ గౌడ్, కిరణ్ నాయక్, శంకర్‌రావు, వెంకట్, పింగళి జోగిరెడ్డి, ప్రవీణ్, పాశం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

భారత జాతీయులపై కొత్త అమెరికా వలస విధానాల ప్రభావం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: అమెరికాలోని కొత్త ప్రభుత్వం అనేక వలస సంస్కరణలను ప్రతిపాదించింది. ఇవి భారతీయ పౌరులను, ముఖ్యంగా ఉపాధి ఆధారిత వీసాలు, గ్రీన్ కార్డులు చట్టపర మైన నివాస పద్ధతులను కోరుకునే వారిని బాగా ప్రభావితం చేస్తాయి. అభివృద్ధి చెందుతున్న వలస ప్రక్రియలో వ్యక్తులు వ్యాపారాలకు మార్గదర్శక త్వం అందించడానికి గెహిస్ ఇమ్మిగ్రేషన్ అంతర్జాతీయ లీగల్ సర్వీసెస్ ఈ మార్పులను నిశితంగా పర్యవేక్షిస్తోంది. భారత ప్రభుత్వం అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 18,000 మంది భారతీయ పౌరులను స్వదేశానికి తిరిగి రప్పించడానికి అంగీకరిం చింది. అనుకూలమైన అమెరికా-భారతదేశ సంబంధాలను కొనసాగించడానికి హెచ్-1బి వంటి వీసా కార్యక్రమాలకు నిరంతర ప్రాప్యతను పొందేందుకు విస్తృత దౌత్య ప్రయత్నాలలో భాగంగా నిర్ణయం తీసుకుంది. పత్రాలు లేని స్థితిలో ఉన్న భారతీయ పౌరులు అధిక అమలు చర్యలను ఎదుర్కోవలసి రావచ్చు, దీని వలన చట్టపరమైన సంప్రదింపులు తప్పనిసరి.

ఎమ్మెల్యే కేపీకి తొలి ఏకాదశి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం బాచుపల్లి 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు బద్రి, బి.సి అధ్యక్షులు చందు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఓ మహిళా ఇంట్లో ఎవరికి చెప్పాపెట్టకుండా వెళ్లి మళ్ళీ తిరిగిరాని సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్ నగర్ కాలనీలో కొర్ర శివ నాయక్, భార్య సునిత(35)తో కలిసి నివాసముంటున్నారు. కొర్ర శివబినాయక్ గతనెల 29వ తేదీన ఉదయం 10 గంటలకు ఉద్యో గానికి వెళ్లాడు. భార్య సునిత ఇంటి వద్దనే ఉంది. సాయంత్రం శివ నాయక్ వచ్చి చూడగా బార్య సునిత ఇంట్లో కనిపించలేదు. దీంతో శివ నాయక్ చుట్టుప్రక్కల, స్నేహితులు, బందువుల ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో శివ నాయక్ మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి అడుగు పచ్చదనం నినాదంతో ముందుకు సాగాలి

వన మహోత్సవంలో స్వయంగా 500 మొక్కలు నాటిన సింగరేణి సిఎండి బలరామ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామగుండం -1 ఏరియాలో సింగరేణి సిఎండి ఎన్. బలరామ్ పార చేత పట్టుకొని స్వయంగా 500 మొక్కలు నాటి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. తెలంగాణ ట్రీ మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న ఎన్.బలరామ్ 2019 నుండి ఇప్పటి వరకు ఆయన సింగరేణి వ్యాప్తంగా 52 ప్రదేశాలలోస్వయంగా 19,570 మొక్కలను నాటగా అవి నేడు వనాలుగా పెరుగుతున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో ఆయనతోపాటు ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ ఇంకా ఇతర అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కూడా పాల్గొని మరో 500 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి అడుగు పచ్చదనం చేసేలా ప్రతి ఒక్కరూ తమకు గల ఖాళీ ప్రదేశాల్లో కనీసం మూడు మొక్కలను నాటాలని, వాటిని పెంచాలని కోరారు. భావితరాలకు మన వారసులకు మనం ఆస్తులు ఇవ్వాల్సిన అవసరం లేదని మొక్కలను పెంచి వారికి అందిస్తే అదే గొప్ప ఆస్తి అని ఆయన పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఇప్పటికే 14 వేల హెక్టార్లలో ఏడు కోట్లకుపైగా మొక్కలను నాటిందని, అవి నేడు పెద్ద వనాలుగా పెరుగుతున్నాయన్నారు. కొత్త గనులు ప్రారంభిస్తున్న ప్పుడు, రోడ్ల విస్తరణ సందర్భంగా అక్కడ ఉన్న వృక్షాలను తొలగించాల్సి వచ్చినప్పుడు వాటిని నరికి వేయకుండా వాటిని ట్రాన్స్ లోకేషన్ పద్ధతిలో వేరేచోటికి తీసుకెళ్లి తిరిగి నాటడం జరిగిందని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ ఈ ఏడాది 45 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఇప్పటికే సుమారు ఐదు లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు. జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ మాట్లాడుతూ ఒక సంస్థకు ఉన్నతాధికారిగా చైర్మన్‌గా ఉన్న ఎన్.బలరామ్ స్వయంగా మొక్కలు నాటుతూ అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. సిఎంఓఏఐ అధ్యక్షులు బి.మల్లేష్, ఏఐటియుసి, డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, ఏరియా ఉన్నతాధికారులు ఎజంట్స్ మేనేజర్లు, కార్మికులు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాధుని రథయాత్ర

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల నుంచి గోపన్ పల్లి రంగనాథాలయం మీదుగా గోపన్ పల్లి జీహెచ్ఎంసీ ఫంక్షన్ హాల్ వరకు ఇస్కాన్ సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కృష్ణ భక్తితత్వం, అధ్యాతికతను వ్యాప్తి చేయడమే గాక పేదల కడుపు నింపుతున్న గొప్ప సంస్థ ఇస్కాన్ సంస్థ అని, గోపన్ పల్లిలో ఇస్కాన్ సంస్థకు మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా 6 వేల గజాల స్థలానికి సంబంధించిన జీ.ఓ ను అందించడం చాలా గొప్ప శుభపరిణామం అని, కెటయించిన స్థలంలో ఇస్కాన్ సంస్థ గోశాలతో పాటు కిచెన్ (వంటశాల) ఏర్పాటు చేస్తారని గాంధీ తెలియచేసారు. శ్రీకృష్ణ పరమాత్ముడి నామస్మరణతో నగరం పులకరించింది. జగన్నాథ రథయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మికతను ద్విగుణీకృతం చేసింది.జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా సాగింది. హరే కృష్ణ.. హరే రామ భజనలు, నృత్యాలతో భక్తులు పారవశ్యం చెందారు అని వివిధ దేశాల ఇస్కాన్ భక్తులు పెద్ద సం ఖ్యలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. వివిధ మఠాల పెద్దలు పాల్గొని కృష్ణ భజనలు, కీర్తలను ఆలపించారు. కోలాటాలు, నృత్యాలు చేస్తూ రథ యాత్ర కొనసాగింది అని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధి భక్తి పద్మ సౌరబ్, ప్రచారక్ స్వామి మహరాజ్, నాయకులు మంత్రి ప్రగఢ సత్యనారాయణ, మర్రపు గంగాధర్ రావు, వేణు గోపాల్ రెడ్డి, సురేష్ నాయక్, ప్రభాకర్ రెడ్డి, రాజేందర్, శ్రీను భక్తులు మరియు తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో లైంగిక వైధింపులను మహిళలు తిప్పికొట్టాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళా ఉద్యోగులు మహిళల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహనను పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో, పనిప్రదేశాలలో వారిపై జరుగుతున్న లైంగిక వైధింపులను తిప్పకొట్టాలని పలువురు వక్తలు అన్నారు. పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగులు ధైర్యంగా పనిచేసే పరిస్థితులను, వాతావరణాన్ని కల్పించే బాధ్యత సంబంధిత యాజమాన్యాలపై ఉందన్నారు. రాజ్యాంగం, చట్టాల ప్రకారం ప్రజలందరికీ సమాన హక్కులు ఉన్నాయని, ఎవరి పరిమితుల్లో వారు ఉండాలని, సమాజంలో ఎవరిని అవమానించే హక్కు ఎవరికీ లేదని వక్తలు స్పష్టం చేశారు. 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ' అంశంపై సదస్సు ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐ.బి.ఇ.యు, ఎ పి, టిఎస్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్, నారాయణ గూడ, తాజ్ మహల్ హెూటల్‌లో జరిగింది. ఈ సదస్సుకు ఐ.బి.ఇ.యు, ఎపి, టిఎస్ చైర్మన్ కె.రాధాకృష్ణ అధ్యక్షత వహించగా, అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, ఇండియన్ బ్యాంక్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఫీల్ జనరల్ మేనేజర్ ప్రణీష్ కుమార్, ఎపిటిబిఇఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ఐబిఇయు, ఎపి,టిఎస్ ప్రధాన కార్యదర్శి పి.వి. కృష్ణరావు, ఇండియన్ బ్యాంక్ మల్కాజ్ జోనల్ మేనేజర్ స్వర్ణ ప్రవ సుందరే, ఎపిటిబిఇఎఫ్ మహిళా విభాగం కన్వీనర్ కె.వి.స్వాతి, ఐబిఇయు, ఎపి, టిఎస్ మహిళా కన్వీనర్ జి.పద్మ ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళలపై లైంగిక వేధింపులు ఆపాలని అవగాహన గోడపత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సదస్సును బి.ఎస్.రాంబాబు ప్రారంభించి ప్రసంగిస్తూ బ్యాంకింగ్ రంగంలో లైంగిక వైధింపులు లేకుండా మహిళా ఉద్యోగులకు ఎఐబిఇఎ వెన్ను దన్నుగా నిలబడుతుం దన్నారు. బ్యాంకులలో మహిళా ఉద్యోగులకు గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పిం చేందుకు బ్యాంకుల యాజమాన్యాలతో పాటు ఎఐబిఇఎ కూడా కృషి చేస్తుందన్నారు. ప్రణీష్ మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకులో మంచి పని వాతావరణాన్ని కల్పించా మని, మహిళా ఉద్యోగులపై వైధింపులు పూర్తిగా లేకుండా కృషి చేస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎఫ్.జి.ఏం పరిధిలోని 490 ఇండి యన్ బ్యాంకు శాఖలు, 8 జోనల్ కార్యాలయాల్లో ఎక్కడా మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు లేకుండా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మహిళల అభ్యున్నతే దేశ అభ్యున్నతి అని, ఇండియన్ బ్యాంకులో మహిళా ఉద్యోగుల పాత్ర గణనీయంగా ఉందన్నారు. టి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు సమస్యలపై చర్చించడం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

ఓల్డ్ మల్లాపూర్‌లో పర్యటించిన నెమలి అనిల్

విశాలాంధ్ర - కాప్రా : బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ ఓల్డ్ మల్లాపూర్‌లోని పఠాన్ బస్తీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పర్యటించి కాలనీలో ఉన్న ప్రధాన సమస్యల గురించి ఉన్నతాధికారులతో మాట్లాడి, ఇంటింటికి తిరిగి ఇప్పటి వరకు అమలు అయిన ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయో లేదో అని ఆరా తీశారు. అలాగే పథకాలు అందని వారికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ప్రతీ ఇంటికి ఆరు గారంటీలు అందేలా కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి ఎస్సీ సెల్ అడ్వైసర్ పీజీ.సుదర్శన్ మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్, మల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, పంజాల శ్రీనివాస్, కె సురేష్ గౌడ్, మల్లాపూర్ ఎస్ టి సెల్ అధ్యక్షులు మహేష్ నాయక్, మల్లాపూర్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వంగవీటి ప్రిన్సు, అశోక్ గౌడ్, జానీ, అక్కు హరి, భాను, భరత్, రఘు, వెంకట్ మహిళా నాయకురాళ్లు ఇంతియాజ్ బేగం, ఇష్రాత్ బానో పాల్గొన్నారు.

చౌకబారు రాజకీయాలను మానుకొని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టండి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: అధికార పక్షాన ఉన్న నేతలు తమ స్థాయిని మర్చిపోయి బజారు భాషతో ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇష్టానుసారంగా విమర్శించడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెల్లిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, నాయకులు జూపల్లి శంకర్, పిల్లి శేఖర్, గుండు అశోక్ తదితరులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నియోజకవర్గానికి చెందిన ఓ యువనేత ఉన్నాడని, ఆ నేత ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని స్వయంగా ఎమ్మెల్యే మీడియా ముఖంగా ప్రస్తావించిన విషయాన్ని గుర్తుచేస్తూ మీ వద్ద ఆధారాలు ఉంటే 48 గంటల్లో రుజువు చేయాలని పత్రికా ప్రకటన చేశామని, దీనికి సంబంధించిన వివరాలు మాట్లాడకుండా పలువురు కాంగ్రెస్ నాయకులు తమకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. ఆధారాలు ఉన్నాయని అధికారంలో ఉన్న ఎమ్మెల్యే ప్రకటించిన విషయాన్ని మర్చిపోయి సోయి లేకుండా కొందరి సూచన మేరకు ఇష్టం వచ్చినట్లు బీఆర్ఎస్ పార్టీ నాయకులను అప్రతిష్ట పాలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఫోన్ టాపింగ్ చేశారని ఫిర్యాదు చేసిన విషయాన్ని సైతం విస్మరించి, సిట్ విచారణలో ఉన్న ప్రస్తుత ఫోన్ టాపింగ్ అంశాన్ని పదేపదే వల్లించడం దేనికి నిదర్శనమని దుయబట్టారు. వ్యక్తిగత విమర్శలకు దిగుతూ, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, టైం పాస్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాజకీయాలు మానుకొని మీ వద్ద ఉన్న ఆ యువనేత ఆధారాలు, పూర్తి వివరాలు ప్రజలకు తెలపాలని అన్నారు.

పటాన్‌చెరువు ఏరియా ఆసుపత్రి మర్చురీని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పటాన్ చెరువు మండలం, పాశ మైలారం, సిగాచి పరిశ్రమంలో జరిగిన ప్రమాదంలో మృతుల గుర్తింపు ప్రక్రియ డిఎన్ఏ పరీక్షల ద్వారా కొనసాగుతున్నదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఏరియా ఆసుపత్రిలోని మర్చురీనీ తనిఖీ చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కొనసాగుతున్న డిఎన్ఏ పరీక్షలకు సంబంధించిన సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. అంబులెన్స్ పోలీస్, ఎస్కార్టుతో పాటు మానవ అవశేషాలు అప్పగింత పనులు సజావుగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చారు. బాధితులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ప్రమాదం జరిగిన సిగాచి పరిశ్రమలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, అగ్ని మాపక శాఖ, హైడ్రా సిబ్బంది ఇంకా శిథిలాల తొలగింపు ఇతర సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాగా ఇప్పటివరకు గుర్తించిన 42 మంది మృతులను, సంబంధిత కుటుంబ సభ్యులకు అధికారికంగా అప్పగించడం జరిగింది. ఇంకా 8 మంది గల్లంతైన వారిగా నమోదవగా, వారి డీఎన్ఏ నమూనాల కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన 18 మంది ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : రేబిస్ వ్యాధిని అరికట్టేందుకు పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి దేవి రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవంను నిర్వహించి ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదన్నారు. కుక్క కాటు ద్వారా మనుషులు, పశువులకు త్వరగా సంక్రమిస్తుంద న్నారు. ఈ వ్యాధిని యాంటీ రేబిస్ టీకా ద్వారా నియంత్రించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా గోల్కొండ ఎల్లమ్మ బోనాల మహోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: జగదాంబికా గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు గత 51 సంవత్సరాలుగా సబ్జీమండి గంగపుత్ర సంఘం, గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 51వ వార్షిక బోనాల వేడుకలను పురస్కరించుకొని ఘనంగా అమ్మవారికి తొట్టెలా బోనం సమర్పించారు. న్యూ గంగానగర్లోని కనకదుర్గ దేవాలయం నుండి అమ్మవారికి భారీ తొట్టెల ప్రారంభమై సబ్జీమండి లోని మాత మహంకాళి దేవాలయం చేరుకుని అక్కడినుండి అమ్మవారికి బోనం, తొట్టెల భారీ ఊరేగింపుగా పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక వేషధారణలతో అసంఖ్యాక భక్తజన సందోహాలతో, గోల్కొండ ఎల్లమ్మ వారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి తొట్టెలా బోనం సమర్పించడం జరిగింది, ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు దోర్నల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ఆనందేశి వేణుబాబు, జగదాంబికా గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షులు కట్ట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మామిడి సురేష్ మంగలి పల్లి బాల నరసింహ, ముఖ్య అతిధులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, గంగపుత్ర సంఘం ప్రణాధికారులు, నల్ల పోచమ్మ, మాత మహంకాళి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృక్షాలే భగవంతుని స్వరూపాలు

విశాలాంధ్ర - అమనగల్లు: వృక్షాలే భగవంతుని స్వరూపాలని, ప్రకృతి, సంస్కృతి రెండే మన భవిష్యత్తు అని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి చెప్పారు. ఆదివారం కడ్తాల్ మండలం హనుమాన్ పల్లి ఎర్త్ సెంటర్‌లో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఔషధ, పూల మొక్కలతో భూదేవిని అలంకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృక్షాలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. తెలంగాణ షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ బిహెచ్ఇఎల్ యూనిట్ అధ్యక్షులు, లోక్ జనశక్తి పార్టీ (రామ్ వీలాస్) కార్మిక విభాగం జనసమీతి మజ్దూర్ సభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి సురేందర్ బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ జీవితమంతా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడినరని అదేవిధంగా సమాజంలో ఉన్న అన్ని వర్గాల వారు ఆర్థికంగా ఎదగడానికి ఎన్నో ప్రణాళికలను రూపొందించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్ సభ్యులు కొడాలి సురేష్, వెంకటేశం స్వామి. దాస్ కోటేశ్వరరావు. నర్సింగరావు తదితరులు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఆదర్శప్రాయుడు బాబూ జగ్జీవన్‌రామ్

విశాలాంధ్ర - పటాన్ చెరువు : దార్శనికుడు, దేశంలో సమసమాజ స్థాపనకు కృషి చేసిన స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పటాన్ చెరువు పట్టణంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ప్రజలందరూ బాపూజీ అని ప్రేమగా పిలుచుకునే బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర సంగ్రామం తో పాటు, తదనంతరం ఏర్పడిన ప్రభుత్వాలలో మంత్రిగా పనిచేసి ఉత్తమ పరిపాలనదక్షుడిగా ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కొమరగూడెం వెంకటేష్, రుద్రారం శంకర్, అఫ్జల్, పృథ్వీరాజ్, చంద్రశేఖర్, శ్రీరాములు, షకీల్, దళిత సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మొయినాబాద్ : బాబు జగ్జీవన్‌రామ్.. దేశానికి చేసిన సేవలు చిరస్మణీయమని మాజీ సర్పంచ్ మధు సూధన్ గుప్తా అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద వార్డులో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ యూత్ అధ్యక్షులు బోడ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రముఖ స్వతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధాని బాబు జగజీవన్ రామ్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా జగ్జీవన్ రావ్ విగ్రహానికి మాజీ సర్పంచ్ రెడ్డిశెట్టి మధు సూధన్ గుప్తా బాబు జగ్జీవన్రామ్ యూత్ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ మాజీ అధ్యక్షులు డప్పు రాజు, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు చందు, మాజీ వార్డు సభ్యులు బోడరామయ్య, యూత్ సభ్యులు మహేందర్, నర్సింలు, శ్రీకాంత్, మనోహర్, గ్రామస్తులు దొడ్డి సత్తయ్య, బాబయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రులు మారినా అవినీతి ఆగలేదు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: సీపీఐ శత వసంతోత్సవాల సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పార్టీ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతిలో లెనిన్‌నగర్, ప్రగతినగర్, ఏబీబర్ధన్ కాలనీ, దేముడు కాలనీ శాఖ మహాసభల సందర్భంగా ప్రగతి నగర్ కొత్త రోడ్లులో ఎం రామకృష్ణ మునీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ... మహాసభల ద్వారా పెద్దఎత్తున పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. దేశంలో బీజేపీ అసమర్థ పాలన కారణంగా మతోన్మాదం, టెర్రరిజం, రౌడీయిజం, ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా వంటి అరాచక శక్తులు పేట్రేగి పోతున్నారన్నారు. ఏపీలో ముఖ్యమంత్రులు మారినా ప్రకృతి సహజ వనరుల దోపిడీ ఆగడంలేదని తెలిపారు. కొండలు, గుట్టలు తవ్వి పక్క రాష్ట్రాల కు తరలించేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో దోపిడీకి పాల్పడిన వారే కూటమి అధికారం లోకి వచ్చాక పార్టీ కండువా మార్చుకుని అక్రమాలకు తెరలేపారని చెప్పారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వారికి సహకరిస్తుండడం అవినీతి, అక్రమాల్ని ప్రోత్సహించడమే అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బనకచర్ల, పోలవరం ప్రాజెక్టు లతో పాటు నగరి-గాలేరు, హంద్రీనీవా ప్రాజెక్టు లను కూడా పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు నీరందించాలని సూచించారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడం లో పూర్తిగా విఫలమైందన్నారు. గుజ్జు పరిశ్రమ యజమానులు సిండికేట్ అయ్యి తక్కువ ధరలకు కాయలు కొంటుంటే ప్రభుత్వం 4 రూపాయిలు ఇస్తాం లే అని కంటి తుడుపు ప్రకటనలు చేసి రైతులను మోసం చేయడం దుర్మార్గం అన్నారు. టీడీపీ ప్రతిపక్షం లో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చితే పగులగొట్టండని ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారని గుర్తు చేస్తూ... ఆయన పిలుపు మేరకు ఈరోజు సీపీఐ అధ్వర్యంలో పగులగొడతామని చెప్పారు. మరోపక్క మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శవరాజకీయాలు చేస్తున్నారన్నారు. బాణాసంచా పేలుస్తూ... కార్యకర్తలతో జేజేలు పలికించుకుంటూ మృతుని ఇంటికి పరామర్శ కు వెళ్తారా అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి అయివుండి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరామర్శ లకు అనుమతులు ఇవ్వకూడదన్నారు. సీపీఐ బలంగా ఉంటేనే అవినీతి అక్రమాలకు అడ్డు కట్టవేసి ఆరోగ్యకరమైన సమ సమాజ నిర్మాణం ఏర్పాటవుతుందని వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ తిరుపతిలో సీపీఐ పోరాటాలతో వేలాదిమంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి కాలనీలు నిర్మించడం వల్ల తిరుపతి విస్తరణ జరిగిందన్నారు. తిరుపతిలో రౌడీలు, గూండాలకు ఎదురొడ్డి అనేక ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడిన చరిత్ర కమ్యూనిస్టులదేనన్నారు. ఈ బహిరంగ సభకు ముందుగా దేవుడు కాలనీలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, లెనిన్ నగర్‌లో జిల్లా కార్యదర్శి మురళి, ప్రగతి నగర్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఏబీ బర్ధన్ కాలనీలో పార్టీ సీనియర్ నేత లక్ష్మి ఎర్రజెండాలు ఎగురవేశారు. సీపీఐ శతవసంతోత్సవాల సందర్భంగా దేముడు కాలనీ, ఏబీ బర్ధన్ కాలనీలో జాతీయ కార్యదర్శి నారాయణ మొక్కలు నాటారు. బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు కే శివారెడ్డి, నగర కార్యదర్శి జే విశ్వనాథ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాకృష్ణ, బీ నదియా, బండి చలపతి, ఉదయ్ , శాఖా కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రమజీవులకు ఎర్రజెండా అండ

- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలి
- సీపీఐ ఏలూరు జిల్లా మహాసభలో వక్తలు

విశాలాంధ్ర-చింతలపూడి: శ్రమజీవుల పక్షాన పోరాడేది, పేదలకు ఎల్లప్పుడు అండగా నిలిచేది ఎర్రజెండా మాత్రమేనని వక్తలు వక్కాణించారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా పిలుపునిచ్చారు. మహాసభల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం స్థానిక రాధా గార్డెన్స్‌లోని కారుమూడి సత్యనారాయణ రెడ్డి ప్రాంగణంలో బత్తుల వెంకటేశ్వరరావు వేదికపై ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ హాజరయ్యారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంచర్ల గురవయ్య, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత బండి వెంకటేశ్వరరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి వసంతరావు స్వాగతోపన్యాసం చేశారు.

మహిళలతోనే విప్లవం విజయవంతం అవుతుందని, మనం శ్రామిక వర్గ నీతిని కలిగి ఉండాలని, కమ్యూనిస్టుల పునరేకీకరణతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం సాధ్యమన్నారు. అక్కినేని వనజ మాట్లాడుతూ దేశాన్ని మత, కుల ఆధిపత్యం వైపునకు నెట్టేందుకు, రాజ్యాంగ హక్కుల హరణకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. వామపక్షాల ఐక్యతతో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. శ్రమజీవుల, హక్కుల కోసం హిందూత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. సహజ వనరులను కార్పొరేట్‌లకు, కాంట్రాక్టర్లకు కట్టబెడతానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. ఇందులో భాగమే పోలవరం నుంచి బనకచర్ల ప్రాజెక్టు అని అక్కినేని వనజ వ్యాఖ్యానించారు. గడ్డు పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి యత్నించిన ప్రతి ఒక్కరు వీరులే అని కొనియాడారు. పార్టీ బలోపేతానికి, మహాసభలు చేసే తీర్మానాలన్నీ నెరవేర్చేందుకు కృషి చేయాలని అక్కినేని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధికి మహాసభలో చర్చించి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, దానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కాగలదని అన్నారు. సమాజానికి కమ్యూనిస్టులు ఎంత అవసరమో, ప్రజా సమస్యల పరిష్కారానికి వారి చేసిన త్యాగాలపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలపై పట్టు సాధించాలని, ప్రజలతో మమేకం కావాలని, సైద్ధాంతిక పునాది ఏర్పాటు చేసుకోవాలని, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అటవీ హక్కుల చట్టం వల్ల లక్షల ఎకరాలను పేదలకు అందించడంలో సీపీఐ కృషి మరువలేనిదని అన్నారు. అనంతరం సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సీపీఐ ఇటీవల నిర్వహించిన పోరాటాల దృశ్యమాలిక, మహాసభలకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్‌ను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు ప్రారంభించారు. ప్రజానాట్యమండలి నాయకులు పిచ్చయ్య, అలెగ్జాండర్, సరిపల్లి లెనిన్, ముల్లగిరి లాజర్ ఆలపించిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి. సభలో సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, బాడిశ రాము, సన్నేపల్లి సాయిబాబా, మైసాక్షి వెంకటాచారి, కారం దారయ్య, జేవి రమణ రాజు, రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, కలిశెట్టి వెంకట్రావు, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్, సీపీఐ చింతలపూడి మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మన్నవ యామిని, నాయకులు కొమ్మన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై సుప్రీం'లో ఆర్జేడీ పిటిషన్

పట్నా: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓటర్ల జాబితా సవరణపై ఇచ్చిన ఆదేశాలను ఆ రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. దీనిపై ఆర్జేడీ తరపున ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ వాదించనున్నారు. ఈ పిటిషన్‌ను సోమవారం విచారించాలని కోరినట్లు సమాచారం. మరోవైపు, జూన్ 24న ఈసీ జారీ చేసిన ఈ ఉత్తర్వును రద్దు చేయాలంటూ ఇప్పటికే అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) ,తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సైతం సుప్రీంలో కోర్టులో పిటిషన్ వేశారు.

ఫాల్కన్ ఇన్వాయిస్ కేసు.. సంస్థ సీవోవో అరెస్టు

భటిండా: ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ కేసులో ఆ సంస్థ సీవోవో ఆర్యన్ సింగ్ అరెస్టు అయ్యారు. పంజాబ్‌లోని భటిండాలో సీఐడీ అధికా రులు ఆయనను అదుపులోకి తీసుకు న్నారు. ఆర్యన్ సింగ్ ఏ5 నిందితుడిగా ఉన్నారు. ఫాల్కన్ ఇన్వాయిస్ సంస్థ పెట్టుబడుల పేరిట ప్రజల నుంచి భారీగా డిపాజిట్లు సేకరించింది. మొత్తం 7,056 మంది నుంచి రూ. 4,215 కోట్లు స్వీకరించింది. మోసం బయట పడటంతో కేసు నమోదైంది. ఆపై సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ఇప్పటి వరకు తొమ్మిది మంది అరెస్టయ్యారు. హైదరాబాద్ కేంద్రంగానే ఈ మోసం జరిగింది. ఈ కేసులో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు 19 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

నితీశ్, చంద్రబాబుది ప్రేక్షక పాత్రేనా?

- సనాతన ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్‌గా పవన్ కల్యాణ్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- మోదీ, షా జోడీ దేశానికి ప్రమాదం : ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి: ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో లక్షల కోట్లు అప్పు చేశారే కానీ ఎటువంటి అభివృద్ధి కనిపించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ పట్టణ మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద ఉన్న రావుల శివారెడ్డి విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించగా, పార్టీ పతాకాన్ని సీపీఐ సీనియర్ సభ్యుడు బాపనపల్లి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దేశ ఆర్థిక వ్యవస్థను తాకట్టు పెడుతోందని ధ్వజమెత్తారు. కేంద్రంలో నితీశ్, చంద్రబాబు సహకారంతో ఎన్డీఏ కూటమి ఏర్పడిందని చెప్పుకుంటూ వారిద్దరికీ నరేంద్ర మోదీ, అమిత్ షా మొండి చెయ్యి చూపిస్తున్నారని అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అజెండాతో పాలన సాగిస్తున్న కేంద్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపిస్తూ... దేశంలో పేదలు లేరని, కేవలం 2.3 శాతం మాత్రమే ఉన్నారటం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. అలాగైతే దేశ వ్యాప్తంగా 50 కోట్ల మందికి, రాష్ట్ర వ్యాప్తంగా 1.40 కోట్ల మందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బియ్యం ఎందుకు పంపిణీ చేస్తున్నాయని ప్రశ్నించారు. డబుల్ ఇంజన్ పేరుతో అక్కడ... ఇక్కడా ఒకే ప్రభుత్వం పాలన సాగిస్తోందని, కూటమి ప్రభుత్వం ఏడాది కాలం పూర్తయినా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమైనా నిధులు ఇచ్చిందా అని ప్రశ్నించారు. కేవలం రాష్ట్రానికి అప్పులు ఇప్పించడం తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నంతకాలం ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాలేదని, ఏకచక్రాధిపత్యంతో పాలన సాగించాడని, తన మాటే వేదంగా ఎవరు చెప్పినా వినకుండా పతనమయ్యారన్నారు. ఇప్పటికైనా తన పంథాను మార్చుకోవాలని జగన్‌కు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం అప్పులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని మరో శ్రీలంక చేస్తోందని ఆరోపించిన కూటమి నేతలు ఇప్పుడు ఏ విధంగా పాలన చేస్తున్నారని, ఎంత అప్పులు తీసుకువచ్చారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రస్తుతం సినిమాలకే పరిమితమయ్యాడని, సీజ్ ది షిప్ ఏమైందో అంటూ చమత్కరించారు. బియ్యం అక్రమ రవాణా చేస్తున్న లారీని సీజ్ ది లారీ అని ఎందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం లేదని రామకృష్ణ ప్రశ్నించారు. బీజేపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా పవన్ కల్యాణ్‌ను చెప్పుకుంటున్నారని, సనాతన ధర్మం అజెండాతో బీజేపీతో లోపాయికారి ఒప్పందంతో ఆయన ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తొలినాళ్లలో ఉన్న ఉత్సాహం ప్రస్తుతం లేదని విమర్శించారు. పవన్ పంథాలో బీజేపీ వాదమే కనిపిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ నియోజకవర్గ, జిల్లా స్థాయి మహాసభలు పూర్తయిన తర్వాత ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, అనంతరం జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ఒక రాజకీయ అజెండాను ఈ మహాసభలలో రూపొందించి చర్చిస్తామని రామకృష్ణ చెప్పారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ పేద, అణగారిన వర్గాలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కేంద్రంలో మోదీ, అమిత్ షా జోడీ అదానీ వంటి కార్పొరేట్లకు దాసోహమై దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన రాష్ట్రం అన్ని రంగాలలో నిర్వీర్యమైందని, ఆర్థిక వ్యవస్థను కూడా చిన్నాభిన్నం చేశారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత పాలకుల అవినీతి కుంభకోణంలో భాగమే స్మార్ట్ మీటర్లని, వాటిని కూటమి సర్కార్ కూడా ఆమోదం తెలపడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే వాటిని తుంగలోతొక్కి స్మార్ట్ మీటర్లు బిగించడం, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. ఈ మహాసభలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ముసునూరి సుహాస్, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, చిన్ని సత్యనారాయణ, పట్టణ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బర్లీ పొగాకు కొనుగోళ్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బర్లీ పొగాకు కొనుగోళ్లు పారదర్శకంగా సాగుతున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి డైరెక్టర్ డిల్లీ రావు తెలిపారు. ఈ ప్రక్రియ గతనెల 19వ తేదీన ప్రారంభమైంది. సీఎం యాప్, ఏపీ ఎయిమ్స్ వంటి డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రక్రియ పార్లదర్శకంగా, రైతులకు అనుకూలంగా సాగుతోందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 11 కొనుగోలు కేంద్రాలలో 724 మంది రైతుల నుంచి రూ. 17.20 కోట్లు విలువ చేసే 2,245 బేళ్లు (2,088 మెట్రిక్ టన్నులు) కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కొనుగోళ్లు సెప్టెంబర్ వరకు సాగుతాయన్నారు. యాప్‌లో నమోదైన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందని అన్నారు. సందేహాల నివృత్తి కోసం వ్యవసాయ అధికారులను లేదా మార్క్‌ఫెడ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ అధికారులను డిల్లీరావు ఆదేశించారు. రైతులు తమ హెచ్‌డీ బర్లీ పొగాకును నాణ్యతా ప్రమాణాలకు లోబడి అధికారులను సంప్రదించి షెడ్యూల్ ప్రకారం కొనుగోలు జరుపుకోవాలని సూచించారు.

25 ఏళ్లకు 'సీరియల్ కిల్లర్' అరెస్టు

న్యూఢిల్లీ: ట్యాక్సీలు అద్దెకు తీసుకోవడం... డ్రైవర్లను చంపేసి అటవీ ప్రాంతాల్లో విసిరేయడం... వారి వాహనాలను నేపాల్ సరిహద్దులో విక్రయించడం... ఇలా అనేక కిరాతక నేరాలకు పాల్పడిన ఓ సీరియల్ కిల్లర్‌ను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 25 ఏళ్లుగా చిరునామా మార్చి పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న అజయ్ లాంబా అనే నేరస్థుడిని ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అజయ్ లాంబా అలియాస్ బన్నీ (49) దిల్లీ, ఉత్తరాఖండ్‌లో నాలుగు దోపిడీ, కిరాతక హత్య కేసుల్లో నిందితుడు. 2001లో దిల్లీలోని న్యూ అశోక్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో అతడిని పోలీసులు నేరస్థుడిగా ప్రకటించారు. 1999 నుంచి 2001 మధ్య జరిగిన అనేక కిరాతక నేరాల్లో లాంబా ప్రధాన సూత్రధారిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత మరికొందరితో కలిసి టాక్సీ డ్రైవర్లను టార్గెట్‌గా చేసుకొని దారుణ హత్యలకు పాల్పడినట్లు వెల్లడించారు. '1976లో జన్మించిన అజయ్... దిల్లీలోని కృష్ణానగర్ నివాసి. ఆరో తరగతి తర్వాత చదువు మానేసి నేరాల బాట పట్టాడు. 1996లో తన పేరును అజయ్ లాంబాగా మార్చుకొని యూపీలోని రాయ్‌బరేలీకి మకాం మార్చేశాడు. అక్కడ ధీరేంద్ర, దిలీప్ నేగితో కలిసి ట్యాక్సీలు బుక్ చేయడం, డ్రైవర్లను చంపేసి ఆనవాళ్లు దొరక్కుండా మృతదేహాలను ఉత్తరాఖండ్ శివారులోని అటవీ ప్రాంతంలో పడేయడం, ఆ తర్వాత వాహనాలను నేపాల్ సరిహద్దుల్లోకి తీసుకెళ్లి విక్రయించడం వంటి నేరాలకు పాల్పడ్డాడు' అని పోలీసులు తెలిపారు. 'దిల్లీ, హల్ద్వానీ, అల్మోరా, చంపావత్‌లో అతడిపై దోపిడీ, హత్య కేసులు నమోదైనప్పటికీ... ఈ కేసుల్లో ఏనాడూ అరెస్టు కాలేదు. 1990లలో చోరీ, ఆయుధాలు కలిగి ఉన్నట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి.. దీంతో పోలీసుల కళ్లుగప్పేందుకు దాదాపు రెండు దశాబ్దాలకు పైగా తరచూ ఒక చోటనుంచి మరో చోటకు మారేవాడు. 2008 నుంచి 2018 వరకు అతడు తన కుటుంబంతో నేపాల్‌లో ఉన్నాడు. ఆ తర్వాత డెహ్రాడూన్‌కు మకాం మార్చాడు. 2020లో డ్రగ్స్ అక్రమ రవాణాలోకి ప్రవేశించిన అజయ్ లాంబా... ఒడిశా నుంచి దిల్లీ, దేశంలోని ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా నెట్‌వర్క్‌లో చురుగ్గా పనిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే 2021లో సాగర్‌పూర్ పోలీసులు అతడిని ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఒక కేసులో అరెస్టు చేశారు. 2024లో ఒడిశాలోని బెహ్రాంపూర్‌లో జరిగిన నగల దుకాణంలో దోపిడీకి సంబంధించి మరో కేసులోనూ అరెస్టయ్యాడు. రెండు కేసుల్లోనూ బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ క్రమంలోనే దిల్లీ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి అజయ్ లాంబాను అరెస్టు చేశారు' అని డీసీపీ (క్రైం) ఆదిత్య గౌతం తెలిపారు. కరడుగట్టిన నేరస్థుడిని పట్టుకోవడంలో కృషిచేసిన పోలీసు సిబ్బందిని దిల్లీ పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

పాలనా వ్యవస్థలో ప్రక్షాళన!

- త్వరలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు?
- సమర్థులకు కీలక పోస్టింగులు... పని తీరే కొలమానం
- మరింత సౌలభ్యంగా ప్రజలకు సేవలందించేందుకు మార్పులు

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్రంలో పాలనా వ్యవస్థకు అత్యంత కీలకమైన ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలు రేపోమాపో జరగనున్నాయి. పాలనలో ప్రతిభకు, సమర్థతకు అధిక ప్రాధాన్యతనిచ్చే ఈ బదిలీల మార్పులు, చేర్పులు రాష్ట్రానికి ఉపయోగపడతాయని ప్రభుత్వ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏడాది పాలనను పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు పరిపాలన వేగాన్ని మరింత పెంచేందుకు, మరింత ప్రగతిశీలంగా, ప్రజాభిముఖంగా మలచేందుకు సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలకు పెద్ద ఎత్తున రంగం సిద్ధం చేస్తోంది. అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఐఏఎస్‌లో భారీ మార్పులు చోటుచేసుకోనున్నట్లు చెబుతున్నారు. గడిచిన 12 నెలల కాలంలో అధికారుల పని తీరును ఆధారంగా చేసుకుని ఐఏఎస్‌ల మార్పులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రతి అర్జీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే అర్జీదారులకు సరైన పరిష్కార మార్గం చూపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఐఏఎస్‌లపై వేటు వేసి వారి స్థానంలో సమర్థవంతంగా పని చేసే అధికారులను నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని శాఖల్లో వైసీపీకి అంటకాగిన ఐఏఎస్‌లు ప్రభుత్వం మారినా పాత పద్ధతిలోనే పని చేస్తున్నారన్న విమర్శలు కూడా జోరుగా వినిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ వర్గాలు ఆ దిశగా బదిలీల జాబితాపై కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలను శరవేగంగా అమలు చేయడంలోను, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలోను, అందుకు సంబంధించిన ఫైళ్లను క్లియరెన్స్ చేయడంతో పాటు ప్రభుత్వ పరంగా నిర్ణయాలు తీసుకోవడంలో చురుగ్గా వ్యవహరిస్తున్న ఐఏఎస్‌లకు ప్రాధాన్యత కలిగిన పోస్టులను కేటాయించే ఆలోచనలో కూడా ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 12 మంది జిల్లా కలెక్టర్లు, అలాగే 17 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీలకు జాబితా సిద్ధం చేస్తున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఫైళ్ల క్లియరెన్స్‌లో కొంత మంది అధికారులు ఎంత చెప్పినా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. మంత్రులు, ఐఏఎస్‌ల మధ్య కొన్ని శాఖల్లో సమన్వయం లోపిస్తున్న పరిస్థితి నెలకొంది. కొన్ని జిల్లాల్లో మంత్రులకు, కలెక్టర్లకు మధ్య దూరం పెరుగుతోంది. రాష్ట్ర స్థాయిలోనూ ఆయా శాఖలకు చెందిన కొంతమంది మంత్రులు, ఆయా శాఖల కార్యదర్శుల మధ్య కూడా చూద్దామన్నా సమన్వయం కనిపించడం లేదు. అనేక సందర్భాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... అధికారులు, మంత్రులు కలిసి సమన్వయంగా ముందుకు సాగితేనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పాలన ముందుకు సాగుతుందని, ఆయా శాఖల పరిధిలోని అభివృద్ధి ఫలాలు కూడా అంతే వేగంగా ప్రజలకు అందుతాయని తరచూ చెబుతూ వస్తున్నారు. అయినా కొంతమంది అధికారులు సొంత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు గుర్తించారు. ఐఏఎస్, ఐపీఎస్‌ల పనితీరే కొలమానంగా బదిలీల ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని శాఖల పరిధిలో ఆశించిన స్థాయిలో ఐఏఎస్‌లకు పని చేయలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ లక్ష్యాలను కూడా కొంతమంది ఐఏఎస్ అధికారులు చేరుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే అంశంపై ఇప్పటివరకు జరిగిన అనేక కలెక్టర్లు, ఐపీఎస్‌ల సదస్సులో ముఖ్యమంత్రి స్పష్టంగా వెల్లడిస్తూ వస్తున్నారు. సమర్థవంతంగా పనిచేసే వారికి తమ ప్రభుత్వంలో ఎప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని, ప్రజలకు సేవ చేసే ఓపిక లేని వారు ప్రాధాన్యత లేని శాఖలకు వెళ్లాలని తేల్చి చెబుతూ వస్తున్నారు. అందులో భాగంగానే ప్రస్తుత బదిలీల్లో కొంతమంది ఐఏఎస్‌లపై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయన్న ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా గోష్య విభాగాలు, హోం, రెవెన్యూ, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు వంటి కీలక శాఖలలో ఉన్న అధికారులను మారుస్తూ, సరికొత్త కాంబినేషన్లపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇదే సమయంలో అనేక జిల్లాల్లోని ఎస్పీలు కూడా బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల జాబితాను సీఎంవో సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.